దిగిరండి....దిగిరండి ధృతరాష్ట్రభువికి

యస్. ఆర్. నంది

మీనా పబ్లికేషన్స్

ప్రథమ ముద్రణ
మే '83

రచన
యస్. ఆర్. నంది

ముఖ చిత్రం :
రాజా

వెల : రూ. 11.00

ప్రింటింగ్ :
సూర్యా ఆర్ట్ ప్రింటర్స్,
విజయవాడ-520 002.

మా నూతన ప్రచురణలు

యన్. ఆర్. నంది

దిగిరండి...దిగిరండి...ధృతరాష్ట్రభువికి...	11-00

డా॥ సి. ఆనందారామం

తపస్వి	13-00
నిశ్శబ్ద సంగీతం	12-50

కొడాలి సాంబశివరావు

ప్రేమ తులాభారం	12-00
గీతాంజలి	11-00
మనసంటే తెలుసా నీకు?	12-00
యుగళ గీతం	11-00

వాసిరెడ్డి సీతాదేవి

తిరస్కృతి	20-00

ఆర్. సంధ్యాదేవి

పగడాల పంజరం	14-00

యండమూరి వీరేంద్రనాద్,
డి. ప్రభాకర్, పమ్మివీరభద్రరావు

దేవుడు నీకులమేమిటి?	14-00

కొండముది శ్రీరామచంద్రమూర్తి	
చిరునవ్వుల మరు సవ్వడి	16.00
(చలన చిత్రంగా రూపొందుతున్న నవల)	
బద్దెపూడి సుధారాణి	
పూలసంకెళ్ళు	12.00
యామినీ సరస్వతి	
సప్తపర్ణి	12.00
చెరుకూరి కమలామణి	
శ్వేత	10.00
పురాణం, గొల్లపూడి, కొమ్మూరి	
(గొలుసు నవల)	
ఇడియట్	22.00

దిగిరండి…దిగిరండి
ధృతరాష్ట్రభువికి

చీకటి సందు దగ్గర నిలబడ్డాను. రిక్షా వచ్చింది.

"రిచ్చా కావాలేంటి బాబూ!" అన్నాడు 'రిక్షా వాలా' వినయంగా.

"రిక్షా వద్దుగాని, ఏం తోచడం లేదు. ఎక్కడికయినా తీసి కెళ్తావా!"

రిక్షావాడు రిక్షా దిగాడు. సన్నగా నవ్వుతున్నాడు.

"ఎక్కడికెళ్దావంటారు!"

"నీకు తెలియాలి"

"మస్దీపూరు కాదా!"

"కాదు."

"అయితే కూకోండి. ఇయ్యాళే మురమండనించి కొత్త పిల్లొచ్చింది"

"ఎక్కడుంటోంది" నాకిష్టం లేక పోయినా ఉత్సుకతతో అడిగేను.

"ఎక్కడండంటే వేం తెలుసుద్ది మీాకు! రండి నేను సూపిత్తా"

"పోలీసులు రారుకదా!"

"అల్లొచ్చేకాడికి తవర్ని తీసికెళ్తానా బాబూ!"

రిక్షా ఎక్కాను. ఆర్టీసీ పాసింజర్ బస్‌లా కాస్సేపు డాన్సుచేసి కదిలింది రిక్షా.

"ఈ రిక్షా నీ సొంతం దేనా?" అని అడిగాను ఏదో ఒకటి మాట్లాడాలని.

"కాదండి. పాతూర్లో ఓ మారాజు వున్నాడు. అత నిచ్చాడు."

"అద్దెంత?"

"పగలైతే రెండున్నర. రోజంతా తీసుకుంటే నాలుగు."

"అతనికెన్ని రిక్షాలున్నాయేమిటి?"

"సాలా వున్నాయండి – అయినా అతగాడి రిచ్చాల లెక్క నాకెందుకండి?"

"నువ్వు సొంత రిక్షా కొనుక్కో లేదా?"

"ఏటి! సొంత రిచ్చాయా! బాబూ! తిండానికే కుండలు డింకీలు కొడుతున్నాయ్. మాకిక సొంతరిచ్చా ఒకటా!" అన్నాడు ఉస్సురంటూ!

"బ్యాంకులు అప్పులిస్తున్నాయి కదయ్యా!"

"ఇత్తున్నాయి. కానీ మా దగ్గర ఇంతుందని, ఏదో వోటి సూపించాలంట! ఆ, ఏదో 'ఓ'టుంటే మాకి కర్మేటి బాబూ!"

అక్కడేదో ఎత్తొచ్చింది. వాడు తొక్కలేక దిగాడు. నేనూ దిగాను.

"తమరెందుకు దిగటం! కూకోండి బాబూ లాక్కుపోతాను."

"ఫర్వాలేదు లేవయ్యా" అని వెనకనించి నేనూ రిక్షా తోశాను.

"ఇక కూకోండి బాబూ!"

రిక్షా ఎక్కాను.

"ఏమయ్యా! ఈ వూళ్ళో ఇలాంటి పిల్లలు ఎందరున్నారేమిటి!"

"నానేం సెప్పగలను బాబూ! నాకో పాతిక్కొంపలు తెల్సు. ఇంకా సాలా పాలా వున్నాయిగాని అయ్యో-ఛా! ఛా! వొద్దు!"

"అన్నీ ఇలాంటివేనా!"

"ఆఁ"

"దీనిమీదే బతుకుతారా!"

"బతుకుతారో సత్తారోగాని, ఇప్పుడీ యాపారం, బాగా లాబసాటి యాపారమై పోయింది బాబూ! ఈళ్ళని సూసి, సంసారోళ్ళు కూడా మొగుళ్ళకి తెలీకండా ప్రైవేటుగా యాపారాలు పెట్టేశారు!"

"నిజంగానా!" విస్తుపోతూ అడిగాను.

"కావాలంటే సూపిత్తా"

"అయితే ఆ మురమాడ పిల్లోద్దు. సంసారి కొంపకే పోసీయ్. వాళ్ళ దగ్గరయితే రోగాల భయం వుండదు."

"బాబోయ్! రోగాలు ఆళ్ళ దగ్గరేనండీ ఎక్కు-వుంటాయి."

"మరి వాళ్ళ భర్తలకి తెలిసిపోదూ!"

"ఎల్లా తెలుసుద్ది! ఆడూ ఓ పుండాఖోర్ నాకొడుకే. తనే ఆ రోగం తగిలించుకొచ్చానేమోనని దొంగకి తేలు కుట్టినట్టు డాకటేర్ల దగ్గరకి పోతుంటాడు!"

"మరి వాళ్ళు సంసార్లన్నావ్-వాళ్ళకిదేం బుద్ధి!"

"సంసారోళ్ళయితే, ముండ దగ్గరకెళ్ళ గూడదని వుందేంటండీ ఎక్కడన్నా! ఇంట్లో కట్టుకున్న పెళ్ళాం ముసల్దాత్తయి పోయిందని, కుర్రదాన్దగ్గరకు పోతారు. అది అప్పటికే ఎందరో్నో ఆస్పటలుకు పంపించేసుంటాది. ఈడికి అయ్యేం తెలవ్వగా! నవనవ లాడు తోందని ఎల్తాడు. అంతే!

మర్నాడు డాకటేరు గది ముందు చెప్పలేకా, బాధ పడ లేక, సావు బతుకుల మద్దెన వూగులాడ్తా వుంటాడు"

"అవును! నాకు తెలీకమగుతాను! సంసారులంటే ఎవ గని నీ వుద్దేశం!!

"సంసార్లంటే తెలవదేటండి! లచ్చనంగా పెల్లాడి, పెల్లాం పిల్లల్తో కాపరం సేసే వోళ్ళు"

"వీళ్ళు సాధారణంగా ఏ వుద్యోగాలు చేస్తుంటారు?"

"ఉద్దోగాల మాటే అడిగారూ? సవాలచ్చ ఉద్దోగాలు చేసే వోళ్ళున్నారు. ఏ వుద్దోగం లేకపోయినా, పదేసి తరాలు కాలుమీద కాలేసుకుని కూకుని తిన్నా తరగని డబ్బున్న వోళ్ళున్నారు. గుమాస్తాలున్నారు. బడి పంతుళ్ళున్నారు. కాలేజీ మేస్టేర్లున్నారు. మీర్నమ్మ్మతారో నమ్మరోగాని బాబూ, డాకటేర్లూ. కోరుటు వీడర్లు కూడా ఎల్తా వుంటారండి!"

"పోలీసులు వెళ్తుంటారా?"

"పోలీసులా? అళ్ళు 'ఎప్పెస' గేంగండి. లంజల్ని పట్టుకుంటావని సెప్పి గుడిసెల్లోకీ, ఇళ్ళలోకీ దూరి; అళ్ళకుతి తీర్చుకుని అళ్ళ దగ్గర్నుంచే డబ్బు లాక్కుని పోతారండి."

"వీళ్ళనందర్నీ నువ్వు తీసికెళ్తుంటావా?"

"తప్పదు కద బాబయ్యా! ఇలాంటి బేరాలు తగిత్తే,

మామూలు కన్నా పావలా, అర్ధా ఎక్కువే ముడతది. అందుకని మేం యిలాంటోళ్ళ కోసమే సూస్తా వుంటావండి."

"అంటే మామూలు మనుషులొస్తే కట్టరా?"

"అమ్మమ్మ! ఎందుకట్టవండి? దాందారి దాందే! దీం దారి దీందే!"

"అంటే?"

"మామూలు మనుషులు, సాదార్నంగా పొగలే ఎక్కుతారండి. మొదటాట యిడిసి పెట్టే వరకూ ఆళ్ళనే మోస్తామండి, అక్కణ్ణుంచి ఈ బేరాలు తగుల్తాయి."

"మీ రిక్షాల్లో మంత్రు లెప్పుడన్నా ఎక్కారా?"

"మంతురు లెవరండి?"

"మన్ని పాలిస్తున్నవాళ్ళు."

"అంటే మినిస్టర్లా? ఆళ్ళెందుకు రిచ్చా లెక్కుతారండి? ఎక్కినా, ఒకేల ఇలాంటి కొంపలకెందు కెల్తారు?"

"అంటే మినిష్టర్లు వెళ్ళరంటావా?"

"నాకేం తెలుసండి? నాకు తెలిసిందల్లా, యిదుగో మీలాటోళ్ళు, కాస్త కూస్త సదూకునోళ్ళూ, కాలేజీ కుర్రాళ్ళూ! కానండి బాబూ! ఈ కాలేజీ కుర్రాళ్ళు మా మంచోళ్ళండి. పాపం! ఆళ్ళకేం యిలాంటి యిసయాలు

తెలవ్వు కదా! అంతా కొత్త. బయం. అందుకని మమ్మల్నట్టుకుని, ఎంతడిగితే అంతా యిచ్చేత్తారండి. అయితే అందరు కుర్రాళ్ళూ అలాంటోళ్ళు కారండోయ్! కొందరు రవుడి స్నాసులుంటారు. ఆళ్ళు నిజంగా కాలేజీ కుర్రాళ్ళో, రవుడీ ఎదవలో తేల్చుకోలేం. రెండు మైళ్ళు తొక్కి తీసికెళ్తే, అర్ధ రూపాయి సేతిలో పడేస్తాడు. అదేంటని మేం నిలేసి అడిగితే, పోలీసోళ్ళకి అప్పజెప్తామంటారు.

"ఒకసారిలాగే, ఒకడు నా రిచ్చా ఎక్కాడు. మద్దెలో మరోడు కలసాడు. ఇద్దరూ సేవితులే లాగుంది. ఇంగిలీసులో గడగడా ఏదేదో మాటాడేసుకుంటున్నారు. నేను ఓ యింటికి తీసికెళ్ళి ఆపాను. ఆళ్ళు రిచ్చా డబ్బు లివ్వకుండా వెల్లిపోతుంటే 'బాబూ డబ్బులు' అని ఎనకాలెల్లి అడిగాను. అంతేనండి నేను ఆడిగింది. అందులో ఒకడు మొల్లోంచి కత్తి తీసి పొడిసి పారిపోయాడు. నాకు బూమ్మీద నూకలుండి పోయి బతికి పోయానుగాని, నేనే ఆ చెణంలో సచ్చుంటే, నా కుంటుంబఁవంతా రోడ్డున పడి అడుక్కు తినేదో, లేక ఈ ఎదవ బతుక్కి దిగిపోయేదో! ఎవర్ని నమ్మలేంబాబూ! రోజులు మారి పోతున్నాయి. మేం పొట్ట కూటికే కదా ఈ ఎదవ పన్లకి దిగింది! ఆళ్లు వాళ్ళు తీట తీర డానికి ఎల్తారు. మరి ఎందుకిలాగ మమ్మల్ని ఏడిపిస్తారో అర్ధం

కాదు. మా బతుకులింతేనేమో బాబు! మళ్లీ ఏ దేవుడో కలికావతారమెత్తి, ఈ పురుగులన్నిట్నీ నాసనం సేసేస్తేతప్ప, మనుసులకి యిముక్తి లేదు."

నా నోట మాట లేదు.

"ఇంటున్నారా బాబూ?"

"ఆఁ సెప్పు"

"ఇందాక సంసాల్లు గురించి అడిగారు కదా బాబూ! అప్పు రేత్రిప్పు ఈ ఏపారం సెయ్యారండి!"

"ఏం?"

"ఇంట్లో మొగుడుంటాడు, పిల్లా పీచికా వుంటారు. ఊసులాడ్డానికొచ్చే అమ్మలక్క లుంటారు. ఎంతయినా లంజెరికంలో బయమేఁ కదా? ఒకేల మొగుడికి తెల్సిపోయిందనుకోండి- ఆడు ఎదవైతే, బాగా నాలుగు దోల్చేసి, మళ్లా ఏలుకుంటాడు. కొంచెం సిగ్గూ సెరవూఁ వున్న వోడైతే, వాత లెట్టేసి, బయటికి తగిలేస్తాడు. లేదూ ఆడు దీన్దబ్బు మీదే బతికేవోడైతే సూసి సూణ్నట్టు పోతాడు. ఇరుగు సనూన్న కోడుకైతే, ఆడే బేరాలు తెస్తావుంటాడు-ఇంకా పొరుగోళ్ళకి తెలవకుండా. ఎవరైనా తప్పిజారి సూసినా, నా వచ్చినోడు దాని అన్ననో, బాబనో సెప్పేసి బయట మచం వేసుకు తొంగుంటాడు! అప్పు బతకలేక రోజూ సచ్చే ఆ

కొడుకులండి! కాని బాగా బతికే వోళ్ళ ఆడోళ్ళు కూడా ఈ లయన్లోకి దిగిపోతున్నారండీ."

"ఎందుకంటావ్?"

"ఒంట్లోగుల; సోకులు; సినిమాలు. నాకు తెల్సిన ఓ మారాజుండే వోడండి! ఆ మారాజు, ఏదో పెద్దుద్దోగవేఁ సేసేవోడు. పెల్లాం కూడా మంచి కుటుంబంనించే వొచ్చిండి. మరి దానికేం పాడుకోగం వచ్చిందో, రోజూ మద్దేనప్పూట, ఎవరింటికో ఎల్తున్నానని వొంకెట్టి, ఎక్కడో, ఎవడ్తోనో తొంగొని వచ్చేది."

"బహుశః ప్రేమించిన వాడేమో?"

"ప్రేవాఁ! వొల్ల కాడా? అంత ప్రేవున్నదైతే ఆడ్తో లేచిపోవాలి. కాని ఈ మారాజుని మోసఁ సెయ్యడమేంటి? అది పేవఁ కాదండి. డబ్బు కక్కుర్తి. రోజుకో యాభై రూపాయలు గల్లున సంపాయించు కొచ్చేది. ఆ మారాజు నెలకి ఆరొందలిచ్చేవోడట జీతఁ."

"ఇంత డబ్బూ ఆవిడేం చేసేది?"

"సెప్పాను కదు బాబూ సోకులు. అయ్యేదో యిదే శాల సెంట్లట, రేడియోలట, ఓపులట, ఐదేసి వందలు కరీదు చేసే సీరలు, వొంటినిండా నగలు, రోజూ ఒక సినిమాకి— పెద్ద టిక్కట్టు కెళ్ళేది. అసలీ సినిమాలొచ్చి ఈ ఆడోళ్ళని సాలా పాడుజేస్నాయి బాబూ—మీ రేవంటే అనండిగాని."

"సరే! ఇన్ని విషయాలు చెప్పావ్. మరి నన్ను ఎవ దగ్గరికి వెళ్ళొద్దంటావా!"

"రామ రామ! నేనెందుకంటానండి! ఎవరి సర్దా ఆళ్ళది! కాని సంసారాడోళ్ళు సెడిపోతున్నారంటేనే బాధగా వుంటాంది. కూటికి లేంది పడుసుకుందంటే ఓమాట!అందులో ఎంత ప పవ్వుఁన్నా, నాయమే వుండనాలి. కాని అన్నీ వుండి, లచ్చనమైన సంసార వుండి, ఈ పన్లేంటి బాబూ! అఁ ఇందాక ఆ మారాజు సంగతి: ఆ యమ్మ అలాగ ఎల్లి డబ్బులు తెచ్చుకునేది గదా! రంకుతనం, దొంగ తనం ఎంత కాలం దాగుద్ది! మూ తేస్తే పడుండడానికి యి దేవన్నా సిన్న యిసయవాఁ సితకదా! ఆ యమ్మ బాగోతం, ఈనోటా ఆ నోటా పడి, సివరికి ఆ మారాజుకి తెల్సిపోయింది. నిజవోఁ కాదో అని, నిగా ఏసి సూసుకున్నాడు! నిజం తేలిపోయింది. 'సీ' అనుకున్నాడు. 'ఇలాంటి జెష్టదాంతో సంసారవేం, టని తన్నలుగురి పిల్లలకీ యిసవెట్టి సంపేసి, తనూ ఆకర్ని యిఃం తిని పోయాడు."

"మరి ఆవిడ!"

"ఆవిడకేం! మారాణి, ఈ వూర్నించెల్లిపోయి, ఎక్కడో మళ్ళీ పాత కద మొదలెట్టిందట. అల్లా యిన్నాను గాని నేనేవఁన్నా ఎల్లి సూడగల్నా అడగ్గల్నా!"

"నాకో చిన్న అనుమానం..."

"ఏటి బాబూ!"

"అసలు ఈ సంసార స్త్రీలు యిలా ఈ లైన్లో, ఎలా పడి చిక్కుకుంటున్నారంటావ్!"

"అబ్బో సాలా పెద్ద కతే అది. ఎవర్తో ముందు, ఎలాగో, ఇది రుచి మరిగుంటాది. దానాపారం అది చేసుకుంటూ వుంటాది. అయితే కాలం పూచు కోదుగా! మనిషి బిగువు, వొంపూ సొంపూ ఎంతకాలం వుంటాయి! అయ్యి సడిగపోతున్నాయని తెలుసుకుంటారు! మెల్లగా ఈ పక్కింటోళ్ళనీ, ఆ పక్కింటోళ్ళనీ, ఆ ఈదిలో వాళ్ళనీ, ఈ ఈదిలోవాళ్ళనీ, మాటల్తో కదిపి సూస్తాది. పడే రకాలుంటాయనుకోండి—ఆళ్ళని మద్దేనపేళ, మొగుళ్ళుండరుగా—అప్పుడు దానింటికి తీసికెళ్తాది. అక్కడికి దానికి తెలిసిన పాత నాకొడుకులు వొస్తారు. ఆళ్ళకి మెల్లగా, ఈళ్ళని తగిలించేస్తాది! ఆళ్ళు యిచ్చే డబ్బులో సగంపైనే అది తీసుకుని, ఒకటీ, రెండూ ఈ పిల్లదాని సేతిలో పెట్టి, పంపించేస్తాది. ఇలాగండీ సంసారపోళ్ళ నాసనమై పోతున్నారు! ఇది ఒకసార్తో ఆగిపోయే వొరద కాదు. ఆ పిల్లలు కాస్త కళ్ళు తెరిసి, 'సగం దానికెందుకియ్యాలని, సాయంగానే కగస్వంగా సొంత యాపారం పెట్టుకుంటారు. ఆళ్ళ వొళ్ళు సడిలిపోతోం

దని అళ్ళు కనిపించిందనుకోండి, అప్పుడాళ్ళు—దాని గురువమ్మ చేసినట్టు, యిరుగు పొరుగువాళ్ళని లైలుగా లాక్కుపోతా రండి. ఇదండీ లోకం! ఇది ఆగదండి బాబయ్యా! మళ్లా ఆ దేవుడే కలికావతారం ఎత్తాలి."

"మరి పోలీసులకి ఈ విషయాలు తెలీవా?" అన్నాను.

"ఎందుకు తెలవ్వు? పోలీసోళ్ళకి తెలుసు, డాకటేర్లకి తెలుసు, లీడర్లకి తెలుసు, జెడిజీలకి తెలుసు. ఇందాక మీరన్నారే మినిస్టర్లు, ఆళ్ళకీ తెలుసు. కాని ఆళ్ళేం సెయ్యగలరు? 'ఇలాంటి ఎదవపన్లు జరక్కుండా సూడండ్రా' అని ఈళ్ళందర్నీ ఉద్దోగాల్లో పెడితే, ఈళ్ళే గడ్డి తింటావుంటే, ఆళ్ళేం సెయ్యగలరు?"

"అవునూ నీ పేరేమిటన్నావ్?"

"ఏవన్లేదే?"

"ఏం పేరు?"

"గురువులండి!"

"చూడు గురువులూ! ఆడపిల్లల్ని పై వూళ్ళనించి తీసుకొచ్చి యిక్కడ వ్యభిచారగృహాల్లో అమ్మేస్తుంటారట. నిజమా?"

"నిజవాఁ నిజవున్నరా?"

"ఎలా అమ్ముతారయ్యా?"

"అబ్బో! అయ్యా ఓ పెద్ద కతల్లెండి."

"నీకు తెలుసా?"

"తెలుసా ఏంటండీ? నా యింట్లోనే జరిగింది."

"నీ యింట్లోనా? ఎలా? ఎప్పుడు?" విస్తుపోతూ అడిగాను.

"సాన్నాళ్ళకితం లెండి. సెప్పుకుంటే సిగ్గుకూడా అయినా యిప్పుడు సెప్పుకున్నా పర్వాలేదనుకోండి."

"ఏం?"

"అల్లాగ సేసినందుకు నాకు అయిదేళ్ళ సిక్ష పడింది."

"నువ్వే చేశావా ఆ పని!"

"కాదు. ఎవడో ఎదవ! ఆ ఏడాత్తర్వాత దొరికాడు. దొరికినోణ్ణి దొరికినట్టే రిచ్చా చైనెట్టి బాది బాది సంపి పారేశాను. అలా నేను సెయ్యకూడదట! అందుకని పురి సిక్కొయ్యబోయి, జెడ్జీగారు అయిదేళ్ళు ఏసి వొదిలేశారు."

"నీకు అభ్యంతరం లేకపోతే చెప్పగలవా ఇదెలా జరిగిందో?"

"అభ్యంతర మేవుందండి? ఇన్ని సెప్పినోణ్ణి అది సెప్పలేనా? అయినా కుక్కల్లాగా, పందుల్లాగా బతికే జాతిమాది.

సిగ్గా సెరవ్వాలేనోళ్ళం, సెప్పుకున్నా సిగ్గుపడం, సెప్పక పోయినా పడం. కాని బాబూ! మేం ఎంత పందులం కుక్కలవైనా మాలో పందుల రకతం, కుక్కల రకతం లేదండి. మనిసి రకతమే వుంది. అది ఏడెక్కిందంటే ఒకణ్ణికాదు. లచ్చల మందిని నిలువునా సంపేసి నవ్వాగల్దు! సెప్తానుండండి" అని రిక్షా ఆపి సోడాకొట్టు దగ్గర కెళ్ళాడు.

అక్కడ ఏదో డబ్బులు వాడికిచ్చి చీటి రాయించుకుని వచ్చాడు.

"ఏమిటది?"

"బ్రేకెట్టు బాబూ!"

"ఎందుకు?"

"ఆశ. ఏమో తగిలిందనుకోండి. రేపు ఎనిమిది రూపాయలొస్తాయి."

"అంటే?"

"ఈ బ్రేకెట్టాట గురించి మీకు తెల్దా!" అని 'మీరింకేం రంకు చెయ్యగల్రు?' అన్నట్టు చూశాడు!

"విన్నాను గాని, ఎలా ఆడతారో ఏవింటో సరిగా తెలీదు.

"తెలుసుకో వొద్దు లెండి. ఇదీ మీకు అలవాటయిందా, క్లోజింగే."

"అంటే?"

"లంజరికం ఓపినింగయితే, బ్రేకెట్టాట క్లోజింగు. ఇక్కడ గుడిసేటి యాపారం తరవాత, లాబసాటి యాపారం యిదే. లచ్చలమంది లచ్చాదికార్లు బిచ్చాదికార్లయి పోయారు! బిచ్చాలెత్తుకునేవోళ్ళు, మరింత బిచ్చాలెత్తుకుంటున్నారు.''

"మరింత మంది ఇన్ని లక్షలు పోగొట్టుకుంటున్నారు కదా! ఈ డబ్బంతా ఎక్కడికో ఒక చోటికి వెళ్తూ వుండాలిగా?"

"ఏమో! అదెక్కడికెల్తాదో మాకు తెలవదుగానీ, ఈ వూళ్ళో యిలాంటి కంపెనీలు నాకు తెలిసి ఏభై వరకూ వున్నాయి. ఈ యాభై మందీ మేళ్ళు కట్టుకున్నారు, కార్లు కొనుక్కున్నారు! లాంచీలు తిప్పుతున్నారు. కొందరు పెద్ద పెద్ద ఒట్టేళ్ళు కట్టుకున్నారు."

"అదంతా మీరిచ్చే సొమ్మే కదూ?"

"అవునండి."

"నీకెప్పుడైనా బ్రాకెట్ తగిలిందా?"

"నాలుగుసార్లు వొచ్చిందండి."

"ఎంతెంత?"

"ఎంతొస్తాదండి? ఒకసారి పదహారు; ఒకసారి ఎనిమిది మరోసారీ ఎనిమిది; మరోసారి ఇరవై."

"ఎన్నాళ్ళ నుంచీ ఆడుతున్నావ్?"

"నాకు వూహ తెల్సిం దగ్గర్నుంచండీ, ముప్ఫై నలభై ఏళ్ళు అనుకుంటా."

"రోజు కెంతాడతావ్?"

"ఆడ్డానికి డబ్బేందండీ? అర్థ, పావలా,"

"అంటే ఈ నలభై ఏళ్ళలో దాదాపు ఏడెనిమిది వేలు తగలేశావన్న మాట.

"అదేలా? ఎలాగవుద్దండి?"

"లెఖ్ఖవెయ్. నీకే తెలుస్తుంది. అది సరే ఈ బ్రాకెట్లు కూడా అందరూ ఆడతారా?"

"ఓ! ఆడోళ్ళు కూడా ఆడతారండి, ఇప్పుడు లాట్రీ లొచ్చాయి—దానికి అంతా ఎగబడ్తున్నారండీ."

"పోలీసులు పట్టుకోరూ?"

"ఆళ్ళకి మామూళ్ళుంటాయండి."

క్షణం ఆగాను.

"ఇందాక అమ్మాయిల అమ్మకం గురించి చెప్తూ ఆపేశావ్. ఆదేవిటి?"

"అది మరీ గోరవండి. ఎవడో ఒక ఎదవో, ఎదవనంజో వుంటారండి. ఆళ్ళు ఇందాక చెప్పలేదూ? అల్లాగే ఇరుగు పొరుగు పిల్లల్ని, వూళ్ళో కూస్తంత ఎర్రగా బుర్రగా వున్న పిల్లల్ని సేవితం చేసుకుంటారండి. ఆళ్ళని సినిమాలకనీ,

ఈట్లికనీ, ఆట్లికనీ తిప్పితిప్పి, తర్వాత ఏదో పూరు తీసుకె పోతారండి. మా చెల్లెల్ని అలాగే ఒక నా కొడుకు. బుట్లో ఏసి, దానికి ఎర సూపించి, తీసుకు పోయాడండి."

"మీతో ఆ అమ్మాయేం చెప్పలేదా!"

"ఎల్లాగ సెప్తారండి! ఆడేమో ఐదరాబాదు సూపిస్తాన్నూ, బొంబాయి సూపిస్తాన్నూ, కలకత్తా సూపిస్తాన్నూ, అని మాయచేసి, ఎవరికన్నా తెలిస్తే ఎల్లనియ్యరని సెప్పి, తీసుకుపోయాడండి. సివరికి దాన్ని ఇసాకపట్నంలో, ఓ లంజల కొంపకి ఐదొందల కమ్మేసి ఎటో పోయాడండి మా సెల్లెలికి కొద్దిగా ఓసమాలొచ్చు. అది మరి కాయిదు ముక్క ఎలా సంపాయించిందో, దాని బాదంతా రాసి, ఒరే అన్నా! తప్పయి పోయిందిరా! మోసం చేసాడు ఆ తలుపులు సవాదిగాడు! నన్ను తీసుకొచ్చి ఓ కొంపలో ఐదొందల కమ్మేసి ఎటో పోనాడు. నేనిక్కణ్ణుంచి తప్పించు రావాలంటే, సుట్టూ రవుడీ ఎదవలు కాపలా వుంటారు! నన్ను ఈ పాడు పన్లోకి దించేసారు. నా వొళ్ళంతా గుల్లయిపోయింది. నువ్వెలాగన్నా వొచ్చి నన్నిడిపించుకు పోరా - అని ఆ రంకు ముండ ఎడ్రసు కూడా రాసింది అందులో. నాకేం సెయ్యాలో తోసలేదు. ఎలాగో ముప్పయి రూపాయలు కూడా బెట్టుకుని, ఇసాకపట్నం ఎల్లాను. ఎల్లి తిన్నగా

దానింటి కెల్లాను. నన్ను చూడగానే నా చెల్లెలు బావురు మంటూ ఏడ్చింది. నేను ఆ 'అమ్మని' కాళ్ళా వేళ్ళా పడి బతిమాలాను. 'చట్। సనేవిఁరా దాన్ని యివ్వ'నంది, 'ఆ అయిదొందలూ యిచ్చేసి కావాలంటే తీసుకుపో' అంది. అయిదొందలు ఎక్కణ్ణుంచి తేగల్ను బాబయ్యా! అదో క్కర్తే అయితే, నంజని చితక బాదేసి, నా సెల్లెల్ని యిడి పించు కొచ్చేసి వుండే వాణ్ణి. అక్కడ అయిదుగురు రవుడీ నా కొడుకులున్నారు. అయినా దైర్యంచేగి ఆళ్ళతో తగూలా టకిదిగి, ఆళ్ళని నాలుగు తన్ని, ఆళ్ళసేత వందదెబ్బలు తిన్నాను. నన్ను గొడ్డుని బాదినట్టు ఆళ్ళు బాదేస్తావుంటే, నా సెల్లెలు గుండె కరిగి పోయినట్టు ఏడ్చింది. దాన్నొకడు లోపలికి లాక్కుపోయి చిదగ బాదాడు. నా వళ్ళంతా నెత్తురు మయం అయిపోయింది. వన్నీడ్చేసి రోడ్డు కవతల దూరంగా పారేశారు.

"మరి నువ్వు పోలీసులకి వెళ్ళి చెప్పలేక పోయూవా?"

"సరి సరి! రామాయనమంత యిని రావుడికి సీతే వవుద్దంటున్నారా బాబూ! ఈ పోలీసోళ్ళూ, ఆ ఎదవలంజ, రవుడీలు ఒకటే! ఆళ్ళని ఊళ్ళు, నెలకింతని యిచ్చి మేపు తుంటారు! ఆళ్ళెందుకు కొచ్చి పట్టుకుంటారు బాబూ!"

"పోనీ మీా చెల్లెళే కొంత డబ్బు కూడబెట్టి తీర్చేసుకో వచ్చుగా!"

"బాబూ! దీన్లో పెద్ద కిటుకుంది. మా చెల్లెలే కాదు, ఆ లంజ కొంపలో పదిమంది ఆకోళ్ళున్నారు. ఆళ్ళంతా అల్లాగ అమ్ముడై పోయినోళ్ళేనట. ఆళ్ళు రోజూ అర్ధా, పాపలా, రూపాయి కూడబెట్టి, పెద్ద ముండకి యిచ్చే సరికి, పోలీసోళ్ళు ఆ కొంప మీాదికి దాడి చేస్తారు. ఆ దాడి కూడా ఈ రవుడీ నా కొడుకులే సేయిస్తారు. దాన్లో, అందర్నీ పోలీసు టేసెన్‌కి తీసుకుపోయి, మర్నాడు కోర్టులో నిలబెడ్తారు. జడ్జి గారు ఆళ్ళని యిచారించరు ఏం చెయ్యరు. ఇనిపించుకోరు, 'నువ్వీపని చేసినావా' అనడుగుతారంట. 'అవు'నని ఈళ్ళొప్పుకోవాలి. ఒప్పుకోగానే పాతికో, యాభయ్యో జులమానా ఏసేస్తారు, అది ఆ పెద్ద ముండ తీర్చదు. మళ్ళీ ఈళ్ళే ఈ ఎదవపని చేసి తీర్చాలి. సరిగ్గా తీరిపోతున్నటయానికీ మళ్ళీ పోలీసులొస్తారు. మళ్ళీ అందర్నీ బొక్కలో తోస్తార్రు. మళ్లీ కోరుటు, జడ్జి గారు 'అపన్చేశావా!' అనడగడం 'చేశా'నంటే పాతికా ఏభై, 'లేదండీ' అని ఏవన్నా సెప్పుకోబోతే జులమానా ఎచ్చించేత్తారట! ఈ జరిమానా బాద పళ్ళకే 'సేసాం' అని బోనెక్కి ఎక్కగానే వొప్పేసుకుంటారట. మల్లా ఆ డబ్బు సెల్లించేసి, కొంపకొచ్చి, మల్లా ఆ రంకు పన్లోనే పడతారు. బాబయ్యా! నాకు తెలీకడుగు

కాను: ఈ కోరుటుల్లో, జెడ్జీలు నాయం సెప్తావని కూకుంటారు కదా, ఆళ్ళు, ఈళ్ళ మాట్లెందుకు ఇనిపించుకోరండి? ఎందుకు అసలు సంగతెలుసుకోరూ? ఎందుకిలాంటి అన్నాయప్పన్లు జరుగుతున్నాయని ఆలోసించరు?" అని అడిగాడు.

"వాళ్ళకి టైమెక్కడుంటుందయ్యా, రోజుకిలాంటి కేసులు వందలకి వందలు చూడాలి. అదీగాక జడ్జీలంటే మామూలుగా మీరనుకునేంత వెర్రివాళ్ళు కారు. ఎదుటి మనిషిని చూసి, వాడెలాంటి వాడో, ఏం చెయ్యగలడో, చేస్తాడో, చేసుంటాడో క్షణంలో గ్రహించగల మనస్తత్వ వేత్తలు. అందుకని ఎవరు బోన్లో నిలబడ్డా నేరం వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా తెలిసిపోతూ వుంటుంది. వాళ్ళని విచారించి కాలం వృథాచెయ్యరు. ఇంకా వెనక సవాలక్ష కేసులుంటాయి కదా. వాటిని చూస్తారు వెంటనే.

"కాని బాబయ్యా! నాదో సిన్న అనుమానం! నా సెల్లెలు కావాలని ఆ గోతిలో దిగలేదు. ఒక ఎదవ నా కొడుకు మోసం వల్ల అదలాగ అయిపోయింది! మరి ఆ మోసం సేసిన ఎదవని, ఎందుకు కోరుటికి పిల్పిసిచ్చించరు?"

"అది వేరే విషయం అవుతుంది గురువులూ! మీ చెల్లెల్నో, మరొకర్నో ఎవర్నో—ఈ నేరం చేశారని పోలీసులు పట్టుకుని కేసుపెట్టారు. వాళ్ళు పెట్టిన కేసుకే తీర్మానం

యిస్తారు కాని, ఆ పిల్లల్ని ఈ పాడు పన్లోకి దించిన వాళ్ళని విచారించరు."

"ఎందుకంటారు?"

"వాళ్ళని పోలీసులు పట్టుకోలేదుగా"

"కాని, అదేగా ఈ తప్పుడు పన్లన్నిటికీ మూలం?"

"అప్పుడు, వాణ్ణే నేరుగా ఎవరో ఒకరు తీసుకొచ్చి, పోలీసులకి అప్పగించాలి. లేదా వాడి మీద కేసు పెట్టాలి."

"అలాగ పెట్టాలంటే సాచ్చికాలూ అవీ గావాలిగా?"

"మరదే కిటుకు. నిజం ఏమిటో తెలుసా గురువులూ! ఇలాంటి తప్పుడు వ్యాపారాలు చేసే వాళ్ళు మామూలు వాళ్ళు కారు. నువ్వూ నేనూ ఆ పనులు చెయ్యగలమా? లేం. ఎందుకు? భయం. పాపభీతి. అదీగాక నలుగుర్లో పరువు పోతుందని భయం. ఇందాక నువ్వో సంఘటన చెప్పావ్ చూశావా? ఆ మారాజు ఎందుకు తన్నలుగురి పిల్లలకీ విష మిచ్చేసి, తనూ చచ్చిపోయాడు? పరువు పోయిందని! నలుగురూ నానా మాటలూ అంటారని. కాని ఈ వ్యాపారాలు చేసేవాళ్ళు వీటన్నిటికీ అతీతులు. నీతి, నియమం, జాలి, దయ, భయం, పాపభీతి లేని కసాయిలు."

"అయితే ఆళ్ళు రాచ్చసుల్లాంటోళ్ళంటారు."

"పుట్టగానే ఎవరూ రాక్షసులుగా పుట్టరు-అని ఇంకొకు

ముందు అనుకునేవారు. కానీ ఈ మధ్య చాలామంది డాక్టర్లు పరిశోధనలు చేసి- ఇలాంటి రాక్షస బీజాలు పుట్టుక లోనే కొద్దిగా వుంటాయని ఋజుచేస్తున్నారట, అయితే వాళ్ళని మంచి వాళ్ళుగా మార్చెయ్యడానికి కూడా వీలుం దంటున్నారు."

"మరి అల్లాగెందుకు సెయ్యటంలేదు?"

"ఎవరు చెయ్యాలంటావ్?"

"అలాగని అన్న డాకటేర్లే"

"వాళ్ళెందుకు చేస్తారు?"

"ఎందుకు సెయ్యకూడదు బాబయ్యా ఇన్ని అన్యా యాలు జరుగుతూంటే?"

"అన్యాయాలు ఎక్కడలేవు? అన్యాయాలు జరుగు తున్నట్టు జడ్జీలకూ, లాయర్లకూ తెలీదంటావా? మరి వాళ్ళెం దుకు ఆ అన్యాయాలని రూపుమాపడానికి పూనుకోవటం లేదు?"

"ఇందాకన్నారు గదా—అది ఆళ్ళ పని కాదని."

"అవును, ఇదీ వాళ్ళ పనిగా ఎవరూ కేటాయించ లేదు."

"ఎవరు కేటాయిస్తారైతే?"

"మీరే!"

"మేవా!"

"ఆఁ"

"ఎల్లాగ బాబూ!"

"మీరు అయిదేళ్ళకోసారి ఎన్నికల్లో ఒకాయన్ని ఎన్నుకుంటున్నారా!"

"అవును."

"వాళ్ళు ఎన్నికయ్యాక, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. చేసిన ప్రభుత్వమే, యిలాంటి అన్యాయాలన్నిటినీ చూసి నిర్మూలించాలి."

"ప్రభుత్వం ఎక్కడుంటాదో మాకేం తెల్సు బాబయ్యా! ఐదరాబాదులోనో, ఢిల్లీలోనే వుంటాదంటారు. అంతదూరం నించి వచ్చి, ఆళ్ళు యిలాంటి లంజల్ని, దొంగ నాకొడుకుల్ని బాగుసెయ్యగలరా! కష్టం కదూ!"

"అందుకే చిన్నచిన్న భాగాలుగాపాలనా యంత్రాంగాన్ని విడగొట్టి, ఒకోక్క అధికారిని నియమించారు, వాళ్ళు చూస్తూ వుండాలి ఇవ్వన్నీ"

"సాల్లాలు! కంసెలే సేనుల్ని మేసేస్తుంటే, యికీ ఈళ్ళెక్కడ యిలాంటాటిల్ని బాగుసేత్తారు బాబూ!"

"బాగు చెయ్యమని మీరంతా అడగాలి."

"బాగు:ది అడిగితే డొక్కలో తంతారు. అసలు వ

బాబుని అడగాలో, మాకు తెలిస్తే కదా, ఆ బాబు దగ్గర కెళ్ళి యియ్యి సెప్పుకోడానికి!"

"పోనీ పార్టీలన్న మాట ఎప్పుడన్నా విన్నావా!"

"ఏ పారిటీలు బాబూ!"

"కాంగ్రెసూ, కమ్యూనిస్టు, జనతా..."

"ఆఁ ఆఁ ఇన్నాను. ఆళ్ళందర్తో సెప్పుకోవాలా!"

"అందర్తోనూ అవసరం లేదు. ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడిపిస్తుందనుకో. వాళ్ళకి ప్రతి పక్షమని ఓ పార్టీ వుంటుంది. వాళ్ళతో చెప్పండి; లేదూ, మీ వూరి ఎమ్మెల్యేగారు మంచి వారని మీరనుకుంటే వెళ్ళి మీ కష్టాలు చెప్పుకోండి. ఆయన ప్రభుత్వాన్ని నడిపే పార్టీకి సంబంధించిన వాడైనా సరే."

"బాబూ! తమరీమాటంటూంటే నాకో యిసయం గుర్తుకొస్తోంది. నిజంగా జరిగిందిది.

"మేం మనుసుల రకతాలతో పుట్టినా—పంల్లాగాను బతుకుతున్నామని సెప్పాను గదా!

మాకు యిళ్ళులేవు.

కొంపా గోడూ లేదు.

నిలవ నీడ వుండదు.

అందుకని ఎండలో ఎండి, వానలో తడిసి, సలికి వొణు

కుతూ సెట్లకింద బతకలేంకదా!

పందులకాయిద్దె సేతనవుతుందేవోఁ గాని, పందుల్లాటోళ్ళం, మేం అల్లాగ బతకలేక, వూరు సినర పోరంబోకు బూవుంటే, అక్కడ కొందరం పాకలేసుకున్నాం.

అది మా అయ్యలకాలంలో మాట్లెండి. ఇప్పుడది పెద్ద గుడిసెల పేటైపోయింది. అన్ని గుడిసెలు లేవగానే, పెద్దోళ్ళొచ్చి పన్నులు కట్టమన్నారు. సరే అని కడుతున్నాం.

ఆ పేటని తవఁరు సూత్తే, కూస్తంత సదువు నేర్చుకున్న పందులు బతికే పేట్లాగ వుంటాది.

కుల్లుకాలవలూ, దోవఁలూ, దొడ్లూ, కుక్కలూ, గాడిదలూ, పందులూ అన్నీ కలిసి మెలిసే బతుకుతాయి. అయ్యన్నీ మా ఆస్తులేలెండి.

ఆ మద్దెన ఓ మారాజొచ్చి, ఏదో మాటింగట్టి 'మీరూ మనసులే! మరెందుకు ఇలా దరిద్రంగా బతకా'లన్నాడు.

'అది మా తల్రాత, మా కర్మ. ఎనక జలమలో ఏదో పాపాలు సేసుంటాం అందుకే యిలాగే పుట్టాం' అనుకున్నాం.

ఓసారి ఓ అరిదాసుగారు, ఏదో అరికద సెప్తా యిదే

ముక్క సెప్పారు.

"ఈ జలమలో ఏవన్నా పాపాలు సేసుకుంటే, పైన యమధరమరాజు దగ్గరున్న సిత్రగుప్తుడు అయ్యన్నీ రాసుకుని, మనిసి సావగానే, ఆణ్ణి నూన్లో ఏగించేత్తాడట. రంపాల్తో కోయిస్తాడంట. కత్తుల్తో, బల్లాల్తో పొడిపించేస్తాడట.

అలాంటి సిచ్చ ఏసాక, ఇక్కడైతే నీ సిక్షాకాలం తీరిపోయింది పోరా ఎదవా అని తోలేస్తారు.

కానీ, అక్కడ అంతలాగా సావ సంపినా, ఆ సిత్రగుప్తుడికి కసి తీరదులాగుంది. మమ్మల్ని యిలాగ పుట్టించి, యింకా యింకా ఏడిపిస్తాడట. ఆ అరికత యిన్నవోళ్ళంతా నిజంగానే ఏడిసేసారండి.

ఆ అరికతకి వొచ్చినోళ్ళు ఎవరనుకున్నారు?

అన్ని రకాలోళ్ళూ వున్నారు.

జేబుదొంగలూ,

పడుసుకునేవోళ్ళూ,

వడ్డీలు తీసుకునేవోళ్ళూ,

పెంచలేక బిడ్డల్నమ్ముకునేవోళ్ళూ,

అమ్మలేక పడుసుకుని, రెండురాళ్ళు రేతిరికి రేతిరే సంపాయించునేవోరూ,

అంతా యిన్నారు.

ఇని ఏడిసేసారు.

మళ్ళా పొద్దుపొడిసింది.

అరికత యిన్నవోళ్ళే, మళ్ళీ ఎవరి పన్లాళ్ళు సేసుకునే వారు.

జేబులు కొట్టేవోళ్ళు,

వూళ్ళోకి పోయేవోరు,

పడుసుకునేవోళ్ళు,

కాలవొడ్డున పాకల్లో చేరేవోరూనూ.

బిడ్డలకి పాలివ్వలేనివోళ్ళు అమ్ముకోడమో, రైలు బండ్లో వొదిలెయ్యడవో సేసేవోరు.

ఇయ్యన్నీ సేసి, దేవుడికి, దణ్ణం ఒకటి పెట్టుకునే వోరు...

సరే పిడకల్లో రావాఁయణం ఏట సెపుతున్నట్టున్నాను ఇనండి.

ఆ మారాజు ఏమన్నాడో తెలుసా!

"సోదర సోదరీమనులారా!" అన్నారు.

అంత పెద్ద మారాజు,

అంత పెద్ద బంగళాలో వున్న బాబయ్యా,
నాలుగు సినిమాఆళ్ళు కట్టిన లచ్చాధికారి,

అంత పెద్ద కారులో వొచ్చిన దరమాతుముడు,

అంత ఖరీదైన సిలుకు లాల్చీ ఏసిన పోద్దోరు,

మమ్మల్నందర్నీ "సోదర సోదరీమన్లారా" అనగానే సప్పట్లు కొట్టేసాం. ఆ బాబు ఆలాగ మమ్మల్ని "సోదర సోదరీమన్లారా" అన్నందుకు కాదు!

అలాంటి మారాజు మమ్మల్ని తన అన్న దమ్ముల్లాగా, అప్పసెల్లెళ్ళగా సేసుకున్నందుకు...

ఆయన తర్వాత పెద లెచ్చరిచ్చాడు.

దేసానికి సొరాజ్జం వొచ్చి ఎంతకాలం మయిందో తెల్సా? సాలా కాలమయింది.

తెల్లోళ్ళని తగిలేసి మన రాజ్జం మనం ఏల్తున్నాం.

కాని ఏలుతున్న దెవరు?

అదుగో ఆ పక్కూర్లో వున్న కిరాతోడు.

ఆడు ఎప్పుడన్నా యిటొచ్చి, మిమ్మల్ని "ఏమ్రా మీరంతా, ఎల్లాగున్నారు? ఎల్లాగ బతుకున్నారు? ఎల్లాగ తింటున్నారు? ఎల్లాగ తొంగుంటున్నారు?" అని అడిగిన పాపాన పోయాడా?

అని అడిగాడు.

మేనంతా గొల్లున "లేదు బాబయ్యా! లేదు, ఒక్క సారీ రాలేదు" అనరిచాం.

ఆ మారాజు ఎనగొచ్చినోళ్ళు నిస్సబదం అంటూ అరిసారు.

ఆ బాబుగోరు మళ్ళీ సెప్పారు.

"ఇప్పుడు నేనున్నాను. ఎందుకున్నాను?

మీరున్నారు ఎందుకున్నారు?

నేనిక్కడి కొచ్చాను. ఎందుకొచ్చాను.

ఆడున్నాడు. ఎందుకున్నాడు?

ఈ గుడిసె లిక్కడున్నాయి. ఎందుకున్నాయి?

మీతో బాటే పందులున్నాయి. ఎందుకున్నాయి?

మీరున్నారు? ఎందుకున్నారు?

ఎందుకో వున్నారు. ఎందుకో బతుకుతున్నారు. ఎందుకో పెళ్ళిళ్ళు సేసుకుంటున్నారు.

సివరికి ఎందుకో సచ్చిపోతున్నారు.

ఇంతకు మించి మీ మానవ జలమకి లచ్చెం లేదా?

ఇంతకు మించి మరేం లేదు?

వుంది.

ఏంటుంది?

సాలా వుంది.

సుకవుంది.

సౌక్యం వుంది.

ఆనందం వుంది.

ఆరోగ్యవుంది.

ఇయ్యన్నీ వున్నయని మీాకు తెలువను.

ఎందుకు తెలవదు!

ఆదు!

ఆడివల్ల తెలవటం లేదు.

ఆడొచ్చి సెస్తే మీాకు తెలిసుండేది.

ఆడొచ్చి అంటే అరదమయుండేది.

కానీ ఆమరాదు.

మీాకు తెలవదు.

తెలిస్తే మీారు ఇంకా యింకా యింకా సుకాలమగు తారని ఆడి భయం.

ఇంకా ఇంకా ఇంకా సవుకరియాలు కావాలంటారని బయం.

ఇంకా ఇంకా ఇంకా మంచి వుద్యోగాలు అమగు తారని బయం.

ఇంకా ఇంకా ఇంకా పిల్లల్ని కంటారని బయం.

అందుకని,

ఇద్దరు లేక ముగ్గురు పిల్లల్తో సరిపెట్టండ్రా అని సెప్తు తున్నారు.

ఆ సెప్పడానికీ, ఆ ప్రచారానికీ కోట్లు కోట్లు కరుసు సేస్తున్నారు.

ఇక్కడ మీరు అన్నమో రామసెంద్రా అంటూ అలమటించి పోతూవుంటే, పిల్లల్ని కనకండ్రా వెదవల్లారా అని ఆళ్ళక్కడ కోట్లుకోట్లు కరుసులు సేసేసి, అందులోంచి పదోంతులు మాత్రమే ఈ ప్రచారానికి కర్సు సేసి మిగతాది, అంటే తొంభై వంతులు, ఆళ్ళ జేబీల్లో ఏసేసు కుంటున్నారు.

అందువల్ల అన్నదమ్ముల్లారా! అక్క సెల్లెళ్ళలారా! కళ్ళు తెరండి.

ఈ ఎన్నికల్లో ఓట్లు అడికి ఎయ్యకండి.

ఏస్తే ఏమవుద్దో సెప్పాను.

ఓట్లు నాకే ఎయ్యండి.

నాకే ఏస్తే నేనేం సేస్తానో తెలుసా!

ఈ పూరి పాకలు తీయించేస్తాను.

చక్కటి మేడలు కట్టించి పెడతాను.

అవి మీకు దరమంగా యిచ్చే ఏరపాట్లు సేయిస్తాను.

ఈ కుళ్ళు కాలవలు తీయించేస్తాను.

చక్కగా కాలవలు సిమెంటుతో కట్టిస్తాను.

మీ అందరికీ—రిచ్చాలు తొక్కుకునే వాళ్ళకి రిచ్చాలిప్పిస్తాను.

పనుల్లేని వోళ్ళకి పనులిప్పిస్తాను.

మొగుల్లు లేని ఆడోళ్ళనీ తల్లీదండ్రీలేని అనాదోళ్ళనీ తీసికెళ్ళి అనాద సెరనాలయంలో సేర్పిస్తాను.

ఈ పేటలో సెత్తా సెదారం లేకండా సేయిస్తాను.

ఇక్కడ సొరగం తయారవుతుంది.

అరదమయిందా?

అంతా అనండి.

బోలో సొతంత్ర భారతదేశానికీ జై!, ఇలాగ ఆ బాబు లెచ్చరిచ్చాడండి.

ఆయాల మా ఆనందాలు ఏమని సెప్పడం?

కల్లు దుకాణం కెళ్ళి, పూటు మొయ్యా తాగేసాం.

పందుల్నీ, ఏట పోతుల్నీ ఏసి, వండేసుకున్నాం.

ఇక సొరగఁవొస్తే, లాభం లేదని ఎవరి మటుకు ఆళ్ళే యిచ్చల ముడిగా తాగి తందనాలాడి, ఎవడి పెల్లాంతో ఎవడు కులికాడో సెప్పలేం.

సరిగ్గా ఈ పేటలో అన్ని సోట్లా యిలాగే జరిగిందని కాదు!

సాలా సోట్ల యిలాగే జరిగింది.

ఎంత మనిసి రక్తవున్నా—అందుకే మేం కుక్క జాతోళ్ళమన్నాను.

"మరి ఎన్నికల్లో ఎవరికి వోటేశారు మీరంతా?"

"ఇంకా సాలా కదుంది బాబయ్యా! ఇంకా అవ లేదు."

ఆ మారాజు మా పేట్లో మీటింగెట్టి ఎల్లిపోయాక, అంతా ఆ మారాజుకే ఓట్లేసేద్దావంటే, ఓట్లే సేద్దామను కున్నాం.

ఆ మనసటి రోజు—ఈ మారాజుకి ఎగసపారిటీగా నిల బడ్డ మారాజు, మీటింగెట్టాడు.

మేవెవ్వరం మీటింగు కెళ్ళకూడదనుకున్నాం. ఆ యిసయం ఆ మారాజుకి తెలిసి, ఆ రేతిరి మా పేట్లో ఏదో సినిమా ఏసి సూపిస్తామని దండోరాఏసారు.

సినిమా అంటే అన్న పానాలు మానేసి కూకునే వోళ్ళమని తెలుసాళ్ళకి.

ఏ సినిమా అన్నాం.

మాయా బజారన్నారు.

ఎన్టీవోడూ, నాగేస్సర్రావూ మల్లీ రేలంగోడు కూడా ఏసారని తెలుసు.

అందుకని మా పేట జనవేఁగాకండా, ఆ వూరి జెన వూఁ, ఆ పక్కూర్లోళ్ళ జెనవూఁ, సీకటడక ముందునించే

సదునుపట్టుకాడ సాపలూ, గోన్లూ, గుడ్డలూ, తాటాకులు ఏసుకూకొనున్నారు.

మద్దెలో తెరకట్టారు. తెరకి యిటూ అటూ కూడా జనవే జనం.

రేతిరి ఎనిమిదయ్యాక, సినిమా మొదలెట్టారు. సాలా చిన్న బొమ్మపడ్డా, ఎంతో యిదిగా సూస్తున్నం.

మద్దెన రీలు అయిపోయి రీలు మార్చే సమయానికి ఆ సినిమా ఏరపాటు సేసిన మారాజు పెద్ద కార్లో వచ్చారు. తెల్లటి సిలుకు లాల్చీ, గ్లాసుగో పంచీ, బంగారం కళ్ళద్దాలూ, మనిషి అచ్చు సినిమావోళ్ళాగానే వున్నాడు.

అతను రాగానే, కొందరుంటారు గదా— 'బాబు గారికీ జై! బాబయ్యకూ జై' అని అరవడం మొదలెట్టారు.

పిల్లలు సరదా కొద్దీ గొల్లున 'జైజై' అంటూ అరిచేస్తున్నారు.

ఆ బాబు ఎత్తైన బెంచీమీదకెక్కి, మైకు ముందు నిలబడి అందరికీ దండాలు పెట్టాడు.

తరాత 'సోదరసోదరీ మనురారా' అన్నాడు.

కొందరు సప్పట్లు కొట్టారు.

పిల్లలు సరదా కొద్దీ పెద్దగా చప్పట్లు కొట్టేసారు.

మా పేట్లో సాలామంది సినిమా బెమమీద వొచ్చారు.

మద్దెన ఈ మారాజు రాడం, ఆళ్ళకి యిష్టంలేదు.

నిన్న మీటింగెట్టిన మారాజుకే మా ఓట్లన్నీ ఏసేద్దామని ముందే అనుకున్నం గదండీ! అందుకని ఆ బాబు ఏం సెప్పుకొంటాడో సెప్పుకోనియ్యమని వూరుకున్నాం.

ఆ బాబు సోదరీ సోదరీమనులరా, అన్నాకే సాలా సేపు అందర్నీ సూస్తూ వుండి పోయాడు.

తరాత మొదలెట్టాడండి.

"నే నింతకి ముందు సాలాసార్లే నిలబడ్డాను.

మీరంతా ఎంతో యిదిగా వోట్లేసి నన్నే నెగ్గించేవోరు.

మీరు సూపించే ఈ ప్రేమకి, ఎలాగ కృతగ్నతలు సెప్పుకోవాలో తెల్టంలేదు.

ఏందుకంటే:

నేను మీ ముందు కొచ్చినప్పుడల్లా ఏమేమో సేసేత్తానని సెప్పడం, ఏవీ సెయ్యలేకపోడడం, మళ్ళీ మీరంతా యిలాంటి కుల్లి కంపుల్లో, కుల్లి బతుకుల్లో, సాలీ సాలని తిళ్ళతో, సాలీసాలని బట్టల్తో ఎముగూ బొదుగూ లేని బతుకుల్లో నే కుళ్ళిపోతున్నారని యిని, సూసినపుడల్లా నా మనసు కరిగిపోయేది. మీ ఎదరికి రాడానికి సిగ్గేసేది.

ఓట్లు యిమ్మని వొచ్చినవుడు, మీాకు నేను సెప్పే వాగదానా లేంటి!

అక్కడి కెల్లాక సెయ్యలేక సేతులు ముడుసు కూకోసోడం యేంటి!

ఇల్లాంటి దెందుకు జరుగలేదో మీాకు తెలవదు.

నేను కేవలం సవాలచ్చ మంది సిన్న సిన్న నాయ కుల్లో, నేను మరీ సిన్నోణ్ణి.

నా మీాదే ఎందరో నాయకులున్నారు.

ఆళ్ళందరి దగ్గరికీ ఎల్లి 'బాబుల్లారా మా వూళ్ళో సివరిపేటలో మనుసులు మనుసుల్లాగా బతకటం లేదండి ఆళ్ళ కింత కూడా, గూడు, గుడ్డా, యియ్యండి మా ప్రబో' అని పెతీ వోణ్ణి అడిగేవోణ్ణి.

అళ్ళు నామాట్లన్నీ యింటూనే వుండే వోరు.

అన్నీ రాసుకుంటూనే వుండే వోరు.

కాని పని మాతరం జరిగేది కాదు.

ఎందుకు జరిగేది కాదో తెల్సుకోడానికి, ఎన్ని సార్లు ఆళ్ళ సుట్టూ తిరిగే వోణ్ణో!

అయినా ఎవుడూ నా మాటినిపించుకునే వోడు కాడు.

గడ్డం పట్టుకుని బతిమాలేవోణ్ణి.

నేతులట్టుకుని పాదేయపడే వోణ్ణి. సివరికి ఎవరూ సూడకుండా, ఆళ్ళ కాళ్ళు కూడా పట్టుకునే వోణ్ని.

ఇదంతా ఎందుకు!

ఎవరి కోసం!

మీా కోసం.

నా పెజలకోసం.

అదే నా వూళ్ళో అయితే, నా యింటో కూసునే లచ్చమందిని ఆడ్డరు సెయ్యగల్ను.

కాని అది పెబుత్వం.

అక్కడ ఎవడిగోడూ ఎవడూ యిన్డు.

ఇనినట్టే కనిపిస్తారంతా! కాని సత్తే సెయ్యరు.

ఈళ్ళతో యిసిగి పోయాను.

ఇక నాకీసారి నిలబడాలని లేదు.

ఎవరికీ ఏవీఁ సాయం సెయ్యలేనపుడు, నేనెందుకు నిలబడ్డం.

అందుకే ఈ మీాటింగెట్టాను."

అన్నారండి.

నిజం సెప్పొద్దూ! ఆ మాట్లినే సరికి మాకే జాలేసింది.

మాకూ యిలాంటి పాట్లే కలుగుతుంటాయి.

ఇంటో గెంజి లేదని, మా రిచ్చాబాబుని డబ్బులు

యిమ్మని అడుక్కుంటే ఇయ్యాల్రా, రేపురా అని తిప్పుతాడే గాని, ఇయ్యనని మాత్రం సస్తే సెప్పడు.

సరిగ్గా మాలాంటి అవస్తే ఆ బాబుదీ అనిపించింది, మాకు ఏడుపొచ్చింది కూడా!

అడుక్కునే వోడెప్పుడూ, యిచ్చేవోడికి లోకువే కద బాబయ్యా?

ఎంత మనిషి కంత – అధికారాలూ, లోకువలూ ఉంటాయి. మేం షిరిచ్చా బాబుని అడుక్కున్నట్టే, ఆ బాబు ఇంకా పెద్ద మినిస్టీరు బాబుల్ని అడుక్కుని వుంటారు.

ఆళ్ళు లేదు పొమ్మంటే - ఆయన లచ్చాదికారి-ఆళ్ళ యిదలింపులకి ఎందుకు పడుంటారు?

మాకోసవే కదా?

అయినా మనిషికి కోపం నేదండి బాబూ. సివరికి యిక ఇసిగెత్తి పోయినట్టున్నారు. ఈసారి నిలబడవంటున్నారు.

"ఈయన పేరేవిటి?"

"రాంబాబుగారండి"

"అంతకు ముందు మీటింగు పెట్టినాయన పేరు?"

"ఎంకటేసులు గారు!"

"వెంకటేశులుగారు మీ గుడిసెలు తీసేసి మేడలు కట్టిస్తానని చెప్పారుగదా? ఆయన్ని ఎన్నుకుంటే ఆయన

అలాగే ఈ పెద్దవాళ్ళ వదిలింపులకి, రాంబాబు గారిలాగేవిసి గత్తి పోతారేమో!"

"ఏమో! సెప్పలేవండి. ఈసారి ఈయనకేసి సూస్తాం ఈయన నెగ్గుతారేమో-ఈ సమయంలో."

"అయితే యింతకీ ఎవరు నెగ్గారు!"

"రాంబాబుగారే నెగ్గారండి"

"అదేవిటి! మీరంతా వెంకటేసులు గారికి వోటెయ్యాలని నిశ్చయించుకున్నా వన్నారు!"

"నిజంగా ఈసారి ఎంకటేసులు గారికే ఎయ్యాలనుకున్నం గాని—రాంబాబుగారు మళ్లీ మీటింగులో అందర్నీ మార్చేసినారండి."

"ఎలా!"

"అబ్బో! ఎలాగంటే ఏం సెప్పనండి! ఈ నాయకుల మాటలూ, మతలబులూ, పెద్దోళ్ళ తతంగాలు సాలా యివరంగా సెప్పేసరికి, 'సీ' అనిపించి ఆ పాత రాంబాబుగారికే ఏస్సావండి."

"డబ్బిచ్చారా!"

"ఛిఛి రావఁరావఁ మాకియ్యలేదండి. ఆఁ! కొందరికి యిచ్చారని యిన్నాంలెండి. మా కియ్యలేదు."

"ఏం!"

"మేవంతా తవఁరికే ఓటేస్తావఁన్నావండి."

"అందుకని నోటి వరకూ వచ్చిన వోటుని వదులు కున్నారన్న మాట."

"బాబయ్యా! నోటు తీసుకుని ఓటెయ్యడవుఁ ఓ గొప్పేనా? మనిసిమీద నమ్మకముండాల! డబ్బంటే ఈయాల వొస్తాది! రేపు పోద్ది! కాని మాట!"

"రాంబాబుమీద నమ్మకం పోయిందన్నావ్?"

"పోయింది నిజవేఁ. కానీ ఆయన మాట్లని నమ్మకం వొచ్చేసింది."

"ఏమ్మాటలు చెప్పా రేవిఁటి?"

"సాలా సెప్పారండి. టూకీగా సెప్పాలంటే 'సోదర సోదరీ మన్లారా! విన్న ఎంకటేసులుగారు ఇక్కడే మీాటిం గెట్టి – మీా గుడిసెలు తీసేసి మీా అందరికీ పక్కాయిళ్ళు కట్టిస్తావఁన్నారు.

రోడ్లేయిస్తావఁన్నారు.

కాలవలు కట్టిస్తావఁన్నారు.

పాయికానాలు కట్టిస్తావన్నారు. ఎలట్రి దీపాలు వ యిస్తావన్నారు, పంపులేయిస్తావన్నారు. రివ్వాలేనోళ్ళకిరివ్వా లిస్తావఁన్నారు!

అనాదోళ్ళకి యింత దారి సూపిస్తా వన్నారు.

ఒక్క మాట్లో సెప్పాలంటే, ఆనాటి రావఁరాజ్యాన్ని మీ పేట్లో కట్టిస్తావఁన్నారు.

కాని సోదరులారా!

ఒక విషయం.

ఇయ్యన్నీ నిజవేఁ.
అందరికీ అలాగే సెయ్యాలని వుంటాది.

కాని ఒక విషయం సెప్తాను.

ఈ పేట్లో దాదాపు అయిదు వేల జనాభా వుంది.
ఆరొందల గుడిసెలున్నాయి.

ఈ ఆరొందలు గుడిసెల్ని తీసేసి పక్కాయిళ్లు కట్టాలంటే ఎంతవుద్ది?

పక్కా సిమేంటు యిల్లంటే గాలీ, ఎల్తురూ వొచ్చే కాస్తంత పెద్ద గదులున్న యిళ్ళన్నమాట.

అలాంటి ఇంటికి ఒక్కోదానికి పది వేల రూపాయలు ఖర్చవుద్ది.

అంటే ఈ ఆరొందల గుడిసెల్నీ పక్కాయిళ్ళగా కట్టాలంటే దాదాపు అరవై లక్షల రూపాయ లవుతాది.

కాలవలు కట్టించడానికి మరో రెండు మూడు లక్షలు.

ఎలట్రీదీపాలు యెయ్యడానికి మరో నాలుగు లక్షలు.
పాయికానాలకి మరో లక్ష.

అనాదోళ్ళకి యింత దారి సూపించలంటే, మరో రెండు లచ్చలెట్టి అనాద సెరనాలయం కట్టాలి.

ఇన్ని కట్టినాక యిక్కడో పోలీసుటేసనూ అదీ వుండాల.

ఇలా అన్నీ కట్టాలంటే, మీా ఒక్క పేటకే దాదాపు కోటి రూపాయలు కర్సవుద్ది.

సోదరి సోదరీ మన్లారా!

మన పెబుత్వం దగ్గర అంత డబ్బే వుంటే, ఏటేటా మీా పేట పక్కనించి పారుతున్న "ఎర్రికాలవ" పొంగి ఎన్ని కొంపల్ని కూలేస్తోందో, ఎన్ని పేణాల్ని తీసేస్తాందో, మీాకున్న 'యావదాస్తినీ' ఎంత నాసనం సేసేస్తుందో మీాకు తెల్సుకదా?

దాన్ని అరికట్టడానికి, ఆ "ఎర్రికాలవకి" ఎగువన సిన్న ఆనకట్టే కట్టి, ఏటా జరిగే ఈ నష్టాన్నే ఆపుండేవోరు.

సరే అదలాగ వుంచండి.

నిజంగా గవర్న మెంటు, ఆ ఎంకటేసులు మాటయిని మీా గుడిసెలు తీసేసి యిళ్ళే కట్టిందనుకోండి!

ఆ యిల్లు ఎవరు కడతారు?

గవరనమెంటు కట్టదు గదా?

ఏ కంటరాకటరుకో కట్టమని పురమాయించి, డబ్బి స్తాది.

ఆ కంటరాకటరు మీా సేతే పని సేయిత్తాడు. మీాకు రోజు కూలీ యింతని యిస్తాడు.

కానీ, దీంటో కిటుకేటో తెలుసా?

ఇళ్ళు కట్టడానికి అరవై లచ్చలని గవరనమెంటు దగ్గర నించి డబ్బు తీసుకుని ఎ ముప్పయి లచ్చలకో బూడిదా, యిసుకా, సున్నం ఏసి ఇళ్ళు కట్టేస్తాడు.

అంటే కంటరాకటరుకి ముప్పయి లచ్చలు మిగుల్తాయి.

మన ఆంధ్ర దేసానికి ఏటా తుపాన్లు రావడం బగవంతుడిచ్చిన వరం.

"ఎవరికి?"

"ఈ కంటరాకటర్లకి."

ఆ తుపాను రాగానే ఇళ్లు సగానికిపైగా కూలిపోతాయి.

మరి ఆ కూలిన ఇళ్ళని ఏ నాదుడూ బాగు సేయించడు. మీారే సూసుకోవాలి.

మీా కంత డబ్బుందా?

లేదు.

అందుకని మిగిలిన గోడల మీాద తాటాకు లేసుకుంటారు.

మన తెలుగోళ్ళకి ఆంజనేయసామి ఆరాద్ద దైవం.

అతని తండ్రి వాయువు.

వాయువుకి పేణ సేవితుడు అగ్గిదేవుడు.

అందువల్ల అగ్గిదేవుడు, ఆమీ పాకల్ని తగలెట్టేస్తా వుంటే వాయుదేవుడు, అగ్గిదేవుడికి సాయం ఎల్లి, మొత్తం నాసనం సేసేస్తాడు.

కాని ముప్పయిలచ్చలు ఎనకేసుకున్న కంటరాకటరు, పెద్ద మేళ్ళో ఆయిగా వుంటాడు.

ఈ కంటరాకటరు ఇంతాసేసి ఎవరై వుంటాడు.

ఈ వెంకటేసుని బామ్మర్దో, మేనల్లుడో, తమ్ముడో, కొడుకో అయివుంటాడు.

సోదర సోదరీ మనులారా!

అందువల్ల ఈ గుడిసెలు పీకి యిల్లు కట్టిస్తావన్న మాటల్లో ఎనకున్న నిజాలు యివి.

ఇల్లు కాలిపోయి మీరంతా గోడు గోడున ఏడుస్తా వుంటే, ఆ ఎంకటేసులు మీాకు ఒకటి రెండు రోజులు బియ్యం బస్తాలు యిచ్చి, సంవతర్పరణలు సేయిస్తాడు. ఆ బియ్యం కూడా అతగాడి సొమ్ముకాదు.

అతగాడికి పెద్ద బియ్యం మిల్లులు నాల్గున్నాయి.

అక్కడ దాన్యం ఆడించుకోడానికి వొచ్చిన రైతుల

దాన్యం బస్తాల్లోంచి, ఒక్కో కిలో బియ్యం తీసేసి, ఆ ఎత్తుని సిన్నరాళ్ళముక్కల్తో బర్తీ సేసి, మీకు ఆ సన్నకారు రైతుల బియ్యాన్ని తనే యిచ్చేస్తున్నట్టు సంతరపణ సేస్తాడు.

ఇది, సోదర . సోదరీమనులారా ఆ పెజానాయకుడి వాగదానాలు. అందువల్ల మీరే నిరనయించుకోండి' అన్నారండి.

"దాంతో మీరంతా తిరిగిపోయి రాంబాబుకు వోట్లేసి గెలిపించేశారు అవునా!"

"అవునండి. సెప్పానుగా మేం మనిషి రకతంతో పుట్టినా పందులం, కుక్కలం. అయితే బుద్దిలో గొర్రెల మందలం."

"ఈ మాత్రం మీ మటుకి మీరు గుర్తించారు కదా—మరి ఇకనించయినా ఎందుకు మంచి వాళ్ళని ఎన్నుకోరు!"

మంచోళ్ళా! ఏటి బాబూ మంచి!

ఎక్కడుంది మంచి!

ఎవడు మంచోడు!

ఎవరు సోర్థంలేకుండా పన్చేసేవోడు!

తెల్లోళ్ళు వుండే టయింలో, యిలాంటి పనులు జరిగేవా!

మనిసికి చదువంటే ఏటో తెలీని రోజుల్లో, మాకు సదువు కావాలి. సదూకుంటాం అని ఎవడూ అడక్కుండానే— ఆళ్ళే బళ్ళు పెట్టి సదువులు సెప్పేవోరట.

ఆ సదువులు, నిజానికి ఈ గుడిసెల్లోకి కూడా వచ్చాయి.

అయితే సిత్రం ఏంటో తెలుసా బాబూ?

ఆ సదువులు సదివినోళ్ళు కిరస్తానీ వోళ్ళయి పోతున్నారని, సాలామంది మాలాటోళ్ళు ఆ సదువులు సదవలేదు.

"కిరస్తానీ వాళ్ళయితే ఏవిటి తప్పు?"

"తప్పేటంటారు బాబూ? కిరస్తానీ వోళ్ళంటే ఎవరు? మాలోళ్ళు. ఆ మాల సదువులు మాకెందుకు?"

"దొరలు కదయ్యా చదువులు చెప్పేవారు? వాళ్లు మాలవాళ్ళు కారుగా?"

"కామా? ఆళ్ళూ మాలోళ్ళే నండి. మా సిన్నప్పుడు ఏ దొరలన్నా మా గుడిసెలకి వొచ్చి, ఏ కిరస్తానీ బోదన్నా సేసి ఎల్లిపోయాక, ఇల్లంతా పేడేసి సుబ్బరంగా సేసుకునే వోళ్ళం."

"అది సరే! మాలవాళ్ళంటే మీకంత రోతెందుకు?"

"రోతేటి బాబూ! ఆళ్ళు అంటరానోళ్ళు."

"అదే ఎలా గయ్యారు!"

"ఎలా గయ్యారంటే—అంతే! ఆళ్ళ పాపవే ఆళ్ళని అంటరానోళ్ళగా నేసేసింది."

"అయితే నువ్వు ఏ కులం వాడివి?"

"తూరుపు కాపోణ్ణండి."

"నువ్వు యిప్పుడు ఏ రాంబాబు గారింటికో, ఎంక టేసులు గారింటికో వెళ్ళావనుకో, వాళ్ళా నిన్ను అంటరాని వాడిగా చూస్తారా, లేక లోపలికి రమ్మనమని వాళ్ళసోఫాల్లో కూచో బెడతారా?"

"ఎందుకూర్కోబెడతారు బాబూ? ఆళ్ళ దగ్గర మేం సిన్నోళ్ళం."

"అంటే మీరు కూడా అంటరాని వాళ్ళకిందే, వాళ్ళ దృష్టిలో లెఖ్కకదా?"

"అంటరాని వోళ్ళనరు గాని, ఎందుకో మాకే ఎల్ల డానికీ, కుర్చీల్లో కూకోడానికీ బయం.

"ఏం?"

"మా కేవుందని ఆళ్ళతో సమానంగా, ఆళ్ళింట్లో కూకోగలం? ఏవుందని ఆళ్ళ సరసన నిలబడి మాటాడ గలం?"

"అంటే, ఏవుంటే వాళ్ళ సరసన నిలబడగలరు?" అనడిగాను.

"డబ్బుండాల! ఓదా వుండాల! ఇంకా యింకా యాపారాలు వుండాల"

"అంటే డబ్బనేదే—ఈ అంటరాని తనాన్ని నిర్ణయిస్తుందంటావా?"

అతను చాలా సేపు మాట్లాడలేదు. ఆలోచిస్తున్నట్టున్నాడు.

"ఏవిటి గురువులూ మాటాడవ్? డబ్బేనా ఈ బేధాల్ని నిర్ణయించేది?"

"కాదనుకుంటానండి.

"ఏం?"

"మాలోడున్నాడనుకోండి. ఆడికి బోల్డు డబ్బు ఎలాగో వచ్చిందనుకుందాం. ఆడిదగ్గర డబ్బుందని, ఆణ్ణి మన సరసన కూకోబెట్టుకోగలవా? మన పక్కన కూకోబెట్టుకుని అన్నం తినగలవా?"

"సరే! ఒక విషయం చెప్తాను. మన మంత్రుల్లో యిప్పుడు చాలా మంది హరిజనులున్నారు. హరిజనులంటే మాల వాళ్ళకు గాంధీగారు పెట్టిన పేరనుకో. ఆ మంత్రి గారొస్తే, ఆయనకి వూరు వూరంతా నివాళిపట్టదూ? పెద్ద పెద్ద వాళ్ళు ఆయన్ని యిళ్ళకి తీసికెళ్ళి భోజనాలు పెట్టరూ? పార్టీలు చెయ్యరూ?"

"నిజవే అనుకోండి. కానీ ఆళ్ళు మినిస్టర్లు."

"అయినా మాలవాళ్ళేకదా!"

"కానీ ఆళ్ళే పెద్ద మినిస్టీన్లు బాబూ! మినిస్టీర్లని ఆ ఓదా లేకండా తీసుకొచ్చి దూరంగా వుంచితే, మర్నాడు ఆళ్ళ బతుకులూ అంతే! ఈళ్ళ డబ్బూ దస్కం ఇళ్ళూ గిళ్ళూ అన్నీ కూలిసేస్తారు."

"ఎలా చేస్తారంటావ్! ఆ మంత్రిగారు మాలోడు కదా!"

"ఆళ్ళకధికారం వుంది బాబూ!"

"అంటే, మాలవాళ్ళకి అధికారం వుంటే, మహాత్ములు కూడా జడుస్తారన్న మాట!"

గురువులు మాట్లాడలేక పోయాడు.

"చూడు గురువులూ! ఒక్క మాల వాళ్ళనే కాదు, ఎలాంటివాడికైనా అధికారం వుంటే చాలు, ఎంతటి బలవంతుడైనా జడుస్తాడు. దేవుళ్ళని తీసుకో. వాళ్ళు అవతారమెత్తి భూమ్మీదికొచ్చారనుకో! రాక్షసులూ, దుర్మార్గులూ ఎలా హడలెత్తిపోయేవారు!"

"బాబూ! దేవుళ్ళ మాటెత్తారుగాబట్టి సెప్తున్నా! దేవుళ్ళూ, రాక్షసులూ మొదట్లో సముద్రాన్ని మజ్జిగలా చిలికారట. అందులోంచి అమురతం పుడితే, దేవతలు మోసంచేసి, ఆ అమురతాన్ని తాగేసి, బలవంతులై

పోయారు. ఇద్దరూ కల్సి సవు(ద్రాన్ని సిలికారుకదా! మరి ఈళ్ళకి దేవతలెందుకు వాటా యివ్వలేదు! ఒక్కేళ రాకుసులే ఆ అమురతాన్ని తాగేసారను కోండి. ఈ దేవతలూ, దేవుళ్ళూ వుండేవారా! అప్పుడు మనం రావనాసురుణ్ణీ, యిర నాకుణ్ణీ, కంసుణ్ణీ, కుంబకర్ణుణ్ణీ, దేవుళ్ళని కొలిసేవారవాం కాదా!"

"నీ వేదాంతం రైటే. అప్పుడీ రాకుసులు అప్పుడప్పుడు అవతారాలెత్తి, దేవతల్ని చంపేస్తూ వుండేవారు. అప్పుడు దేవతల్నే దుర్మార్గులనేవారం. అవునా?"

"అవుననుకోండి. కానీ దేవతలు దేవతలే. రాక్ససులు కిరాతకులు."

"మళ్ళీ యిలాగంటున్నావేం!"

"ఏదో సెప్పలేను. ఇష్ణుమూర్తినీ, శివుణ్ణీ, బెమ్మనీ—ఆ మాట కొస్తే ఏ దేవుణ్ణీ తిట్టలేనండి. ఆళ్ళు దేవుళ్ళు."

"కానీ యిప్పుడు చిత్రమైన వేదాంతం చెప్పావ్! అమృతాన్ని దొంగతనంగా తాగేసినవాళ్ళు దేవతలై పోయారన్నావ్!"

"ఏదో నోరు జారుంటాను."

"నోరు జారడం కాదు గురువులూ! మీ కిప్పుడు నిజానిజాలు తెలుస్తున్నాయి. ఆలోచన వస్తోంది. అయితే

వెనకటి భక్తిభావం పోవటంలేదు. కొత్త భావాన్ని నమ్మడానికి భయపడుతున్నారు. నువ్వు నిజంగానే ఆ 'అమృతం,' 'విషం' అన్న మాటల్ని యధాలాపంగా అనేసినా ఆ 'సత్యం' ప్రస్తుత పరిస్థితికి సరిగ్గా సరిపోతోంది."

"ఎలాగ బాబూ!!"

"మీరంతా రాక్షసులనుకోండి, అనుకో కాసేపు. ఈ వున్నవాళ్ళు దేవతలనుకో. 'మీరిద్దరూ' కలిసి దేశం కోసం పాటు పడుతున్నారు."

"నేనేం పాటుపడుతున్నాను బాబూ"

"రిక్షా తొక్కటంలేదూ!"

"అది నా పెళ్ళాం బిడ్డల్ని పోసించుకోడానికి."

"కానీ అదే సమయంలో, ఒకళ్ళనో ఇద్దర్నో రిక్షా ఎక్కించుకుని తొక్కుతున్నావ్. అంటే, వాళ్ళు సుఖంగా ప్రయాణం చేస్తున్నారన్న మాటేగా! నువ్వు రిక్షా తొక్కినా, అడుసు తొక్కి గుడిసెలు కట్టినా, బిల్డింగులు కట్టినా, మగ్గంనేసి బట్టలు తయారుచేసినా—అది నీకు కొంత భుక్తినిచ్చినా—మరొకరికి ఉపయోగపడి, వాళ్ళకి సుఖాన్నిస్తోంది. ఇలా మీరూ, వాళ్ళూ కలసి పనిచేస్తున్నట్టే లెక్క. అయితే రాక్షసులకు ఏమీ దక్క నివ్వకుండా, దేవతలు అమృతం తాగేసి అమరులైపోయినట్టు, మీ కష్టాన్ని మీకు

వదిలేసి, వాళ్ళు సుఖపడుతున్నారు. మీరు పెద్ద బిల్డింగులు కడతారు. కానీ అందులో వుండగలరా? వాళ్ళు వుండ నిస్తారా? లేదూ—ఒక బట్టలు మిల్లులో పని చేస్తుంటారు. ఐదొందలు ఖరీదు చేసే చీరనో, గుడ్డనో తయారు చేస్తారు. కానీ ఆ అయిదొందల చీరనూ, బట్టనూ మీరు 'కట్టుకో' గలరా?"

"అదేటి బాబూ? డబ్బు ఆళ్ళది? మిల్లు ఆళ్ళది. మెషీన్లు ఆళ్ళవి."

"ఎలా? డబ్బు అనేది రూపాయి రూపంలో వుంద నుకో, దాన్ని ఎలా తయారుచేశారు? భూమిలోంచి తవ్వి, తీసి ఒక లోహాన్ని బయటకు తీసుకొస్తారు. దాన్ని శుద్ధిచేసి రూపాయి ఆకారం యిస్తారు. ఇచ్చిన వెంటనే అది ఈ అఘ నిక దేవతలు మింగేస్తారు! ఈ భూమి ఎవరి సొత్తు? భూమిలో ఉన్న లోహాలు ఎవరి సొంతం?"

"డబ్బిచ్చి తవ్వించుకున్నవోళ్ళదేకదా బాబూ?"

"సరే! ఈ నీళ్ళు ఎవరివి? గాలి ఎవరిది? వర్షం ఎవ రిది?"

"అందర్దీనూ."

"మరి ఈ గాలీ, నీరూ అందర్దీ అయినప్పుడు— మిగతా వన్నీ అన్నీ అందరివీ కావా?"

గురువులు తల గోక్కున్నాడు. రిక్షా మెల్లగా ఆగు తోంది—వాడి ఆలోచనల సంచలనంవల్ల!

"బాబూ తమరు సదూకున్న వోరు! ఇయ్యన్నీ తెలు స్తాయి. మరి మాకెట్టా తెలుస్తాయి. తెలిస్తేమటుకు చేసేదే ఉంది!"

"గురువులూ! ఇందాక—చదువు కిరస్తాని వాళ్ళదని, చదవటం మానేస్తానన్నావ్.

ఎందుకు!

కిరస్తానీ వాళ్ళంటే మాలవాళ్ళనీ, మాలలంటే అంట రానివాళ్ళని, అంటరానివాళ్ళంటే పాపాత్ములని- అని నీఅభి ప్రాయంగా చెప్పావ్.

మొదట నిన్ను నువ్వుసరిచేసుకుని, ఆనాడు చదివుంటే ఈవాళ మరికాస్త బాగా ఆలోచించేవాడివి.

చదువంటే ఏమిటో కాదయ్యా.

మన మెదడ్లో ఉన్న తెలివి వికసించడమే.

ప్రకృతి చూడు.

పూల చెట్లని జాగ్రత్తగా నీళ్ళోసి పెంచు.

అది పెరిగి మొగ్గ తొడిగి, పుష్పించి, సువాసన నిస్తుంది.

అదే పూల చెట్టుని చవిటినేలమీద వెయ్యి.

లేస్తుందా? మొగ్గలు వేస్తుందా? వికసిస్తుందా? సువాస నిస్తుందా?

మనిషి కూడా అంతే.

చెట్లకి సహజంగా ఆ వికసించే శక్తిఉంది.

మనిషికీ ఉంది. కానీ సరయిన నేలా, నీరూ లేకపోతే చెట్టు నాశనం అవుతుంది.

సరైన శిక్షణ లేకపోతే, మనిషి గిడసబారిపోతాడు. గుడిసెలకే "పరిమితం" అయిపోతాడు.

"బాబూ మేం ఒకేళ చదూకుని ఎదిగినా, మమ్మల్ని పీడించుకు తినేవాళ్ళుంటారు. వాళ్ళనెలా తప్పించుకోవడం?" అని అమాయక ప్రశ్న వేశాడు.

"పీడించేకు తినటం, మోసం చెయ్యడం ప్రకృతి ధర్మం గురువులూ.

ఒకరకం చెట్టుంది. అది మరో చెట్టుమీదే మొక్కగా లేస్తుంది. ఎదుగుతుంది. ఎలా?

ఆ చెట్టు సారాన్ని పీల్చుకుని.

మెల్లగా దానివేళ్ళు చెట్టుమీదనుంచి కిందికి దిగి భూమిని తాకుతాయి.

భూమిలోకి దాని వేళ్ళు వెళ్ళాక పైన ఎదుగుతున్న చెట్టు, అసలు చెట్టు చుట్టూ ఆక్రమించుకుంటుంది.

చివరికి, మొదటి అసలు చెట్టు కుళ్ళి నాశనమైపోతుంది

ఆ చెట్టుమీద పెరిగిన చెట్టుమాత్రం హాయిగా ఉంటుంది.

వేపచెట్టుని చుట్టుకుని పెరిగే రావిచెట్టు చూడు.

తాటిచెట్టుని అల్లుకునే చెట్లని చూడు.

అంతే మనిషి ప్రకృతి కూడా.

అయితే చెట్టుకి తిరగబడే శక్తిలేదు,

లేకపోతే తన కొమ్మల్లో లేచి తనసారం పీల్చుకుని, తననే నాశనంచేసిన ఈ రాకాసి చెట్టుని, అది చంపేసిఉండేది.

మనిషికి చలనం వుంది.

బుద్ధి వుంది.

చేతులూ కాళ్ళూ వున్నాయి.

ఇన్ని వుండి కూడా వీడిమీదపడి బతికే ఒక్క మోసగాణ్ణి, ఎందుకు కొట్టి తగిలెయ్యలేడు?

అశక్తత కాదది.

బుద్ధి లేకపోవడం కాదది.

శక్తి లేకకాదు.

మరేమిటి?

మనిషిని మనిషి ప్రేమించలేకపోవడం.

మనిషంటే మనిషికి ద్వేషం.

మనిషికుండే స్వార్థం. ఒకడి స్వార్థం వందమందిని చంపుతుంది."

"స్వార్థం ఎవడికుండదు బాబయ్యా! నాకు తెలదా!"

"ఇదికాదు స్వార్థమంటే. మరొకడి పంచను చేరి పది మందిని నాశనం చేయటం. పదిమందిని "చంపి" ఒకడు బతకడం. ఆ ఒకడులోని నీతి చచ్చి లక్షమంది బతుకుల్ని నాశనం చేయుటం."

"బాబయ్యా ఒకమాటడుగుతాను ఏమనుకోరు గదా!"

"ఏం అనుకోను చెప్పు"

"ఇన్ని యిసయాలు యింతబాగా సెప్పారే, మరి తమ రెండుసు లంజెల దగ్గరికి వెళ్తున్నారిప్పుడు!" నిజంగా నాకు నవ్వొచ్చింది పకపకానవ్వాను.

"ఎందుకు బాబూ అల్లాగ నవ్వుతున్నారు!"

"గురుపుణా మొన్నట్లో నేను ఆ చీకటి సందు దగ్గర నిలబడి వున్నాను గుర్తుందా!"

"ఉంది బాబూ!"

"నిన్ను పిలిచానా"

"లేదు"

"నాదగ్గిరికి నువ్వే వచ్చి రిచ్చాకావాలేంటి బాబయ్యా! అని అడిగావ్. అవునా!"

"అవునండి!"

"అలా ఎందుకడిగావ్!"

"అది మా...వృత్తికద బాబూ! ఎవరుకాపడ్డాఅలాగే అడుగుతుంటాం"

"కాని నువ్వు అలా అడిగావా! రిక్షా వద్దుగానీ, ఏం తోచటంలేదు. ఎక్కడికన్నా తీసికెళతావా అన్నాను గుర్తుందా!"

"ఉంది బాబూ! ఎక్కడికన్నా తీసికెళతావా అని ఎవరడిగినా, మాకు ముందు ఇయ్యే గుర్తొస్తాయండి. అదీగాక తమరు సీకట్లో నిలబడి ఉన్నారు. అందుకని ఏ పిల్ల దగ్గరికో తీసికెళ్ళమంటున్నారని అనుకున్నా!"

"తర్వాతేమన్నావ్!"

"మురమండనించి...రండి నేను సూపిత్తా అన్నా"

"మరి నేనేం అడక్కుండా, నువ్వే తీసికెళతానని చెప్పి నా ఉత్సాహాన్ని ప్రోత్సహించి తీసుకొస్తున్నావ్"

"కానీ ఆళ్ళ గురించి సాలా అడిగారు"

"తెలుసుకోవాలని"

"తెలుసుకొని ఏం సేస్తారు బాబూ! ఆళ్ళు దొంగ ముండలు"

"వాళ్ళ గురించేకాదు! చాలా చెప్పావ్, చాలాచాలా విషయాలు చెప్పావ్"

"బాబూ ఒకమాటడగనా?"

"అడుగుతూనే వున్నావ్‌గా? అడుగు"

"తమరు...తమరెవరు?"

"నీలాగ మనిషినే"

"అదికాదు. సీ అయిడీలా?"

నవ్వాను. "కాదులే"

"మరి!"

"రైతుకుటుంబం నించి వచ్చాను"

"అల్లాగే అనుకున్నా"

"ఎలా కనిపెట్టావ్?"

"మీా మాసిపోయిన సొక్కా, సినిగిపోయిన పంచె మాసిన గడ్డం"

"రైతులంతా అలాగే ఉంటారా? లేక యిలావుండే వాళ్ళంతా రైతులంటావా?"

"ఏవో సరిగా సెప్పలేను గాని బాబయ్యా, తవర్ని సూడగానే అల్లాగే అనుకున్నా...బాబూ! అదిగో ఆ కని పించేయిల్లే. ఎల్తారా?" అన్నాడు.

"వెళదాం కానేవు ఆగు, నువ్వు చాలా విషయాలు

సగం సగం చెప్పి ఆపేశావ్. అవి పూర్తిగా చెప్పు! అప్పుడు వెళదాం."

"ఏంటి మానేశాను?"

"మీ చెల్లెల్ని అమ్మేసినవాడ్ని ఎలా పట్టుకున్నావ్? ఆమెను ఎలా విడిపించావు? తర్వాత ఎలక్షన్లలో రాంబాబు నెగ్గి ఏం చేశాడు?...ఇంకా..."

"మా సెల్లెల్ని అమ్మేసినోడేనా? ఆడెవడో కాదండి. మా దూరబ్బంధువే! ఆడిపేరు తెలుపులు"

"మీ ఇంటి దగ్గరే వుండేవాడా?"

"కాదు. ఎక్కడో రిచ్చా తొక్కుకునేవోడు. ఒక రోజున కనిపించి, మా ఇంటికొచ్చాడు! ఆడికి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలుకూడా! ఇద్దరూ ఆడోళ్ళే. ఆడి పెల్లం ఎవడ్తోనో లేసిపోయింది."

"మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా?"

"లేదు. దొమ్మరి గుడిసెల్లో దూరేవోడు. ఇట్లో ఆడ దుంటేఇంట్లో పిల్లలకి కట్టడిఉంటాది. కానిఆడిపెళ్ళంలేకపోవడం వల్ల యిద్దరూ, తలోరకంగా సెడిపోయారు."

"ఇప్పుడెక్కడున్నారు!"

"తెల్దు. చిన్నది బళ్ళల్లోఅడుక్కునేది. పెద్దదిఅక్కడా ఇక్కడా కూలిపన్లు సేసేది, కూలిపన్లే సేసినా, మంచిమంచి

గుడ్డలు కట్టుకునేది. దానిబాబు, ఎప్పుడన్నా ఇంటికొస్తేకదా దాని సంగతెలీడానికి. ఆడు రిక్సా తొక్కి, వచ్చిన డబ్బంతా తాగుడికి తగలేసి, మిగిలిందుంటే ఏ దొమ్మరి గుడిసెకోపోయే వాడు. పెద్దది అలాగిలా నానాపన్లూ సేసి, సివరికి ఒకనాడు కనిపించకుండా పోయింది! ఎక్కడికి పోయిందో, ఇప్పటివరకూ తెల్దు! సిన్నది రైలుబళ్ళలో అడుక్కుంటూ, సివరికి అదీ ఆ బండితోనే ఎక్కడికోపోయింది"

"ఇతను నీకెలా కలిశాడు." అనడిగాను తలుపులు గురించి.

"రిచ్చా తొక్కుతుంటే కల్సాడు. బంధువునని సెప్పి మా ఇంట్లో సేరాడు. మెల్లగా ఎలాగో నా సెల్లెల్ని బుట్టలో ఏస్సాడు.ఏస్సి తీసుకుపోయి, యిసాకపట్నంలో అమ్మేసి, ఎక్కడికో పోయాడు"

"మరి మీ చెల్లెల్ని ఎలాగ విడిపించావ్?"

"అదో పెద్ద గమ్మత్తు బాబూ! నన్ను ఆ రవుడీలు సిదగసంపి రోడ్డుపక్కన పారేశారుగా! పొద్దుట ఎవరో కాలేజీ కుర్రోళ్ళు సూసారు. ఏవేవో తిట్టి పోయారు. సాయంకాలం కూడా, నేనక్కడే అలాగే పడుకున్నాను. మళ్ళీ ఆ కాలేజీ కుర్రోళ్ళు వచ్చారు. కాలేజీ కుర్రోళ్ళు బలే సిత్రమైన వోళ్ళండి."

"అంటే"

"ఒక్కాలేజీ కుఱ్ఱోడు, ఒంటరిగా, రోడ్డు మీాంచి పోతుంటే, అందమైన ఆడది కాపడిందనుకోండి. ఆ పిల్లేపు ఒకసారి చూసిసూడనట్టు సూసి, ఎల్లి పోతాడు! అదే ఇద్దరు ముగ్గురు కల్సి వున్నారనుకోండి—ఇక సూడండి-యికయికలు, పకపకలు-ఆళ్ళ కళ్ళనీ, ముక్కునీ నోటినీ, జెడనీ, ఇంకా యింకా ఆ పిల్ల వొళ్ళునీ సాలా యిదిగా ఎక్కిరించేస్తూ, యిజిలేస్తూ, పాట్లుపాడ్తూ-ఎవరో సినీమా ఏకటేర్ల పేర్లతో పిలుస్తూ, తెగ అల్లరి సేసేత్తా వుంటారు."

"అలా ఎందుకు చేస్తారంటావ్?"

"ఎందుకేంటి బాబూ! ఆ పిల్ల కళ్ళు యిటు తిప్పి ఆళ్ళేపు సూడాలని."

"ఒకవేళ చూస్తే?"

"ఎవరోగానీ, సాదార్నంగా ఎవురూసూడ్రు. ఒకేళ సూసిందే అనుకోండి. ఆ సూపుల్లో ఉన్న దీన్నిబట్టి ఆ పిల్లైన కాల పడ్డవో, లేక నోర్మూసుకుని వూరుకోవడవోఁ లేకపోతే మరీ పోకిరీవోళ్ళయితే ఇంకా ఏడిపించడవోఁ సేస్తారు."

"మరి ఆడపిల్లలు యిలా మగపిల్లల్ని ఏడిపించరా?"

"అమ్మో! ఇళ్ళంతకంటే గడుగ్గాయిలండి! అయితే మొగోళ్ళంత ఇదిగా అన్రు. ఎక్కువగా సదూకున్న కుఱ్ఱదై

తేనే ఏడిపిస్తాది. అలాగే ఉండాల్లెండి. సరికి సరిగా సెప్పచ్చుకుని సవాఁదానక్కి సెప్పిందంటే ఈ ఎదవ ఏడిపింపులూ, ఇకిలింతలూ దానికయ్యే తగ్గిపోతాయి. కాని ఏంటో మన ఆడోళ్ళు ఎంత సదూకున్నా, అంతకు తెగించరండి. ఏదో కుక్కలో, కోళ్ళో అరుస్తున్నాయని పోతారు. అలాగని అందరూ అలాంటోళ్ళు- కారండిబాబు. కొందరేఅలాంటోళ్ళు—ఆడోళ్ళనూ ఉన్నారు, మొగోళ్ళనూ వున్నా...ఆఁ! మల్లీ పిడకలేటలో పడ్డాను. కాలేజీ కుర్రోళ్ళు ఆడాళ్ళనింత ఏడిపిస్తారా! కాని మరోడు ఎవడన్నా ఆ ఆడపిల్లని ఏవన్నా అన్నా నేసినా వూరుకోరండి. నా యిసయంలో అలాగే జరిగింది.

“పగలంతా దెబ్బలతో రోడ్డుపక్క పడున్నానని సెప్పానుగదా! కాలేజీ కుర్రోళ్ళు సూసి కొందరు తిట్టుకుంటూపోయారు. కొందరు ఈసడించుకుంటూపోయారు! కొందరు నేను అడుక్కునేవోణ్నేవో అనుకుని నా పక్కన డబ్బులేసిపోయారు.

“సాయంకాలం కూడా నేను అలాగే అక్కడే ఉండే సరికి, అదే కాలేజీ కుర్రాళ్ళు అక్కడికొచ్చారు. బస్సుకోసం లాగుంది. నిలబడిఉన్నారు. అందులో కొందరు ఆడపిల్లలు కూడా ఉన్నారు, ఒకబ్బాయి నా దగ్గర కొచ్చాడు. “ఒరే పొద్దుటా ఉడిలాగే పడున్నావు సత్తావో ఏంటో”అన్నాడు. “సావనిద్దూ! జన్మాభా అన్నా తగ్గుతుంది” అని మరోడన్నాడు

ఇలాగ రకరకాలుగా ఆస్యాలాడుతున్నారు. నాకు కడుపుడి పోతోంది. లేని బలాన్ని అంతనీ కూడా బెట్టుకుని లేసికూన్నాను.

"బాబూ! నేను అడుక్కునేవోడ్ని కాదు బాబయ్యా!" అన్నాను.

"మరెవరి వోయ్! ఎమ్మెల్లేవా!" అని నవ్వారు.

"ఏవో తెల్దుగాని, నన్ను రవుడీలు కొట్టి యిక్కడికి ఈడ్చి పారేసారు"

"ఏం- దొంగతనాలలో వాటాలు కుదరలేదా!" అని మరొకాయన అన్నాడు.

"నేను దొంగను కాదు బాబయ్యా!"

మరి!"

"మన గుండూ ప్రొఫెసరు బాపతేమోరా!" అన్నాడొక కుర్రబ్బాయి.

"కాదు బాబయ్యా! ఏపీకాను. మా సెల్లెల్ని అన్నాయంగా, ఒకడెత్తుకొచ్చేసి, ఈ ఊళ్ళో అమ్మేసాడు, నాకు తెలిసి ఇక్కడికొచ్చాను. ఆళ్ళనల్లి అడిగితే నన్ను సితకబాది ఇల్లాగ పారేసారు బాబయ్యా!"

ఈ మాటలనేసరికి కాలేజీకుర్రోళ్ళు ఒకళ్ళ నొకళ్ళు సూసుకున్నారు బాబూ.

"మీ సెల్లెలిప్పుడెక్కడుంది?"

"అదెవరో రంగమ్మ కంపెనీ అట దానిలో పెట్టిబంధిం చేస్తారండి"

"ఒరే రంగమ్మంటే మీ అత్తలాగుందిరా" అన్నాడొక బాబు.

"నోర్ముయ్" అని అరిసాడు ఆ బాబు "ఏటి! మీ సెల్లెల్ని ఆళ్ళు ఎబిసారంలోకి దింసేసారా?" అన్నాడు.

"అవును బాబూ" అంటూ కతంతా సెప్పాను

కాలేజీ కుర్రాళ్ళు సాలా సిత్రమైనోళ్ళని సెప్పానుకదా బాబూ!

అప్పటికప్పుడే ఆళ్ళెళ్ళి, మరికొందర్ని పిల్చుకొచ్చేసారు.

మరికొందరు చిన్న కర్రలు తెచ్చారు.

"ముందు పోలీసులకి సెప్దావన్నారు. సాలామంది వొద్దన్నారు.

"పోలీసులకీ ఆ రంగమ్మకీ దోస్తీ.ఆళ్లురారు.వొచ్చినా కోర్టూ, కేసూ, తిప్పలాట" అన్నారు.

మరి ఏం చెయ్యాలని ఆలోసించుకున్నారు.

సెణంలో అంతా పోలోమంటూ ఆ రంగమ్మ కొంప మీదకి ఎల్లారండి.

ఆ కొంపలో దొరికిన రవుడీలని దొరికినట్టల్లా తన్నేసారు. రంగమ్మని సావబాదారు.

అక్కడున్నా వాళ్ళలో నా సెల్లెలెవరో ఆళ్ళకి తెలవదుగా! అందుకని అందరి పిల్లల్ని నా దగ్గరికి తీసుకొచ్చారు.

నీ సెల్లె లెవరన్నారు.

నన్ను సూడగానే నా సెల్లెలు బావురుమంటూ నా మీదపడి ఏడ్చేసింది.

అప్పటికే జెనం చాలామంది కూడిపోయారు.

ఆళ్ళనందర్నీ తప్పించడానికి పోలీసు లొచ్చారు.

కాని కాలేజి పిల్లల్ని సూడగానే ఆళ్ళెందుకో సల్లగా జారుకున్నారు.

"మీ వూరేదిరా అబ్బీ!" అన్నారొకరు.

సెప్పాను.

"ఒరే సోమూ, రమేష్-మీ యిద్దరూ వీళ్ళని వాళ్ళ వూరు దేబెట్టి రండ్రా" అని ఇద్దరు కుర్రాళ్ళని ఇచ్చి, మా సేతికి ఏభై రూపాయలిచ్చి మమ్మల్ని పంపించారు.

ఈ "కథని" నేను పత్రికలో చదివాను. వివరాలు కూడా పూర్తిగా తెలుసు. ఆ వార్తకి హీరో యితనన్న మాట!

"తర్వాత!" అన్నాను.

"మేం యింటికొచ్చాక, నేను పదిరోజులు మంచాన పడ్డాను. ఆ పది రోజులూ, ఆ కాలేజీ బాబు లిచ్చిన ఏభై రూపాయలే మా కాదర వయ్యాయి. కాని... నా సెల్లెలు పదిహేను దినాల్తర్వాత కాలవలో పడి సచ్చిపోయిందండి।" అన్నాడు మామూలుగా! ఎలాంటి విచారం లేని ప్రమాను లాగా!

"ఏం"

"పరువు,"

"నువ్వేం అన్లేదుగా?"

"అంటానని బయమో, లేక ఇరుగు పొరుగు వాళ్ళ మాటలు పళ్ళేకో, పేణాలు బలవంతాన తీసేసుకుందండి."

"మరి ఈ రిక్షావాడు ఎలా కనిపించాడు నీకు మళ్ళీ?"

"ఒక రోజున పకూ్కరికి బేరం వొప్పుకుని ఎల్తున్నా నండి. రోడ్డు పక్క ఓ గుడిసుంది. కాఫీ, టీ, సారా అమ్ము తారక్కడ. అదేకాదు, గుడిసేటి యాపారం కూడా వుంది. అణ్ణి సూడగానే నాకిక కోపం ఆగలేదు బాబయ్యా! రిచ్చా దిగి ఆడి మీద పడి, రిచ్చా చైనెట్టి బాదిబాది పేణం తీసే స్సాను."

"అతను వెంటనే చచ్చిపోయాడా?"

"చచ్చే వుండాలి."

"నువ్వు నిర్ధారణ చేసుకోలేదా?"

"లేదు బాబూ! ఎందుకు సేసుకోవాలి? నా సెల్లెల్ని నిలువునా కూల్సేసి కాల్సేసి, నాసనం సేసేసాడనే ఉక్రోసంతో, అంతకు తెగించి బాదాను కాని, సంపాలని అనుకో లేదు. మనసులో ఆణ్ణి ముక్కలు ముక్కలుగా సేసి, సంపేసి కాకులకీ, గెద్దెలకీ ఏసెయ్యాలని అనుకున్నాను నిజఁవే! కాని సెల్లెలు దొరికినాక, ఆ మంట కొంత సల్లారింది. కాని అది పేణం తీసుకున్నాక, మళ్లీ వుడికి పోయాను. అందుకే ఆణ్ణి సూడగానే గొడ్డుని బాదినట్టు బాదేసాను బాబయ్యా! ఓ నిండు పేణాన్ని నిలువునా తీసెయ్యాలంటే మనిసి ఎంత వుడికిపోయుండాలి? ఎంత దైర్నం కావాలి? ఎంత పిరికి మొండి తనం కావాలి? అయ్యన్నీ మనిసిలో వుండబట్టే బాబయ్యా ఈ మోసాలూ, పాపాలూ, దగాలూ కూనీలూను."

"తర్వాత ఏవయింది?" అని అడిగాను.

"ఏఁవవుద్ది? పోలీసోళ్ళున్నారుగా?

ఎవరు? బ్రాకెట్లాడే వోళ్ళ దగ్గర లంచాలు తినే రచ్చక బటులు, లంజల పడుపు కూడులో వాటా కోరే నాయరచ్చకులు, పెద్దోళ్ళ బయట గేటన్నా దాట్టానికి-గుండెల్లేని రచ్చక బటులు-ఆళ్ళు నన్నట్టుకెళ్ళి-కొట్లో పెట్టి

సితక బాదిసి-నిజం సెప్తున్నా వినకండా లాఠీల్తో కుల్లబొడిసి ఆనక కోరుటులో నిలబెట్టారు. కోరుటోళ్ళు ఎవరూ నన్నేం ఆడగలేదు. సాచ్చికాలు మాతరం అడిగారు. సాచికాలు సెప్పేవోరి మాటలే యిన్నారు. 'ఓరి బాబుల్లారా! ఎందు కింత సైముకర్సు, నేనే ఆణ్ణి సంపాను, ఆడు సేసిన పని యిది బాబూ' అంటున్నా యినుపించుకోకండా, రెణ్ణెల్లు యిసారణ జరిపి, జరిపి సివరికి ఐదేళ్ళు జైల్లో పడేశారు.

"బాబయ్యా! ఈ నాయాన్నీ, ఈ నాయం సెప్పే కోరుటుల్నీ సూస్తుంటే నాకు బలే సిత్తరంగా వుంటాది బాబూ! ఒకసారి నా సిన్నతనంలో మా అయ్య జేబీలో అణా కాసు దొంగతనం సేసేసి, ఏదో సినిమా సూసొచ్చాను. ఇంటి కొచ్చాక మా అయ్య 'ఏరా అణా దొంగతనం సేసావా!' అని చెవి పట్టుకున్నాడు. నేను నిజం సెప్పేసాను. దాంతో మా అయ్య రెండు తగల్నిచ్చి-అలా ఇంకెప్పుడూ సెయ్యకు అని ఒకటి తగిల్నిచ్చాడు. ఇదంతా పది నిమసాల్లో జరిగి పోయింది. దొంగతనం, సిక్సా పది నిమసాల్లో మా దగ్గర జరిగి పోయిందే! మరి ఇంత పెద్ద సదువులు సదూకున్న "నేనే సంపానర్రా" అంటే రెణ్ణల్లు ఎందుకు కేసుని యిసారించారో తెల్దు. మా యింట్లో లాగా పది నిమిసాల్లో ఎందుకు జరగదు! అనిపించింది. అది ఇప్పటికీ నాకు ఆలోచిత్తా

వుంటే సిత్తరంగానే వుంటాది. సదూకున్న వోళ్ళని నాయం సెప్పమంటే, సంవచ్చరాలు పట్టించాలా బాబూ!"

వాడు చెప్పింది నిజమే. నేరమూ, శిక్షా పదినిమి షాల్లో పరిష్కారమయి పోయింది. కాని ఇది నవనాగరిక సత్సాంప్రదాయాలు గల సమాజం. ఇది శిక్షాస్మృతి ప్రకా రం జరగాలి. అదంతా వాడికి వివరించగలను. కానీ ఇప్పుడు నాకంత టైము లేదు.

"అఁ ఇక అది చాలుగానీ, ఇప్పుడు ఆ గెలిచిన రాంబాబు సంగతి చెప్పు." అన్నా.

"రాంబాబు గారేనా? ఆయనే గెలిసారు! ఆయన పార్టీ కూడా గెలిసిందట. మామూలుగానే ఆయన మిని స్టీరు కాలేదు. అందువల్ల మా గుడిసెలు గుడిశల్లాగానే వుండిపోయాయి. మా కుల్లి కాలవలు కుల్లి కాలవల్లాగానే ఇంకా బాగా పెరిగిపోయి, మరికొన్ని సిన్న కాలవ పిల్లల్ని పెట్టేసాయి. వొచ్చే ఎన్నికలకి అయికూడా పెరిగి పెద్దవై పోతాయి. పదిమందికి రిచ్చాలిచ్చారు. ఊరికినే కాదు, నెల కింతని జవఁకట్టాల! ఆ రిచ్చాలని రాంబాబు తమ్ముడిగోరి అల్లుడిగోరే తయారు సేసేవోరంట! అయితే రాంబాబుగోరు గెలవడంవల్ల మాకో లాభం వచ్చిందండి."

"ఏవిఁటి?"

"ఇంతకు ముందు కొందరే ఈ గుడిసేటి యాపారాలు సేసేవోరు. ఇప్పుడు సాలామంది సేస్తున్నారు."

"అదా లాభం?"

"లాబం అదికాదు. ఏ పోలీసోడైనా ఆళ్ళని పట్టుకెళ్ళిపోతే, ఆ మారాజు సాయంగా వచ్చి యిడిపించుకొచ్చేవోరు. 'ఎదవ ముండల్లారా! ఇంకెప్పుడూ యిలాగ సెయ్యకండి. సేస్తే రోగాల్తో సస్తారు." అనేవోరు.

"ఇలాగుందాండి ఇది? ఒకరోజున మా గుడిసెల్దగ్గరికి పెద్దపెద్ద కార్లూ, టాకటేర్లూ, మరేయో పెద్ద పెద్ద మెసిన్లూ వొచ్చాయండి. అయ్యన్నీ ఎందుకో అనుకున్నాం. కాని తరాత తెలిసింది బాబూ! మా గుడిసెల్ని కొన్నిట్ని పడగొట్టి అక్కడేదో ఫేక్టరీ కడతారట. అందులో ఎంత నిజవుందో తెలువదు మరి!"

"నిజంగా ఫ్యాక్టరీయేకడితే అందులో మీకు వుద్యోగాలిస్తావన్నారా?"

"ఎవురికి తెల్సు బాబూ!"

ముందు కొన్ని గుడిసెల్ని పడగొట్టేశారు.

అయ్యన్నీ సిన్న సిన్న దుకాణాలోళ్ళవీ, కాపీలమ్ముకునేవోళ్ళవీ, బీడీలూ సుట్టలూ అమ్ముకునేవోళ్ళవీ!

పరే అయి పడగొడ్తే పడగొట్టారు.

ఆళ్ళకి మరోసోట ఏవన్నా దారి సూపించారా?

లేదు బాబూ!

ఆళ్ళ మానాన ఆళ్ళని అలాగే వొదిలేసారు.

కొందరు రిచ్చాలు తొక్కడం తెలవకపోయినా, రాంబాబుగారి తమ్ముడి దగ్గర రిచ్చాలు అద్దెలకు తీసుకుని రిచ్చా వోళ్ళుగా మారిపోయారు.

సరే! ఆళ్ళు మగోళ్ళు గాబట్టి రిచ్చాలు తొక్కగల్రు, మూటలు మోసుకోగల్రు.

కాని ముగుళ్ళు పోయినా, నీతిగా బతకాలని, సిన్న సిన్న దుకాణా లెట్టుకుని దుంపలూ, పుణుకులూ, జంతికలూ. అమ్ముకునే ఆడకూతుళ్ళు ఏవైపోతారండి?"

మాలో కొందరు దైర్నంచేసి రాంబాబు గోరింటికెళ్ళి, ఈ అన్యాయం గురించి సెప్పాం.

సెప్తే ఆరేవన్నారో తెల్సా బాబూ!

"ఒరే అబ్బాయిలూ, మీ పేట బాగుసెయ్యాలని సర్కారోళ్ళు పూనుకున్నారు. ఇప్పుడు అడ్డుపుల్ల లెట్టారా మొదటికే సెడతారు" అన్నారు.

అంటే అక్కడ పేకటరీ కట్టరన్నమాట, మా పేట బాగుసేత్తారన్నమాట! పోన్లే, పేట బాగుపడుతుందంటే, కొందరు దెబ్బతిన్నా ఫరవాలేదని, అందరం ఓనాడు మీటింగెట్టుకుని సరే అన్నాం.

ఆ మర్నాడు ఎంకటేసులుగారు అక్కడికి కాలినడక నొచ్చి ఒక మీటింగెట్టారు.

ఆనవాయితీయో లేక ఊతపదమో తెలవదుగానీ ముందు ఆబాబు "సోదరీ సోదరీమన్లారా" అన్నారు.

తరవాత "మీరంతా పేదలు. ఏవో సిన్నసిన్న కొట్టెట్టుకుని బతుకుతూవుంటే ఆటిల్ని పడగొట్టి మిమ్మల్ని తరిమేస్తున్నారు."

మీరెక్కడికి పోగలు?

పోనీ మళ్ళీ మీకు ఎక్కడన్నా కొట్లు ఎట్టుకోమని తలాటిచ్చారా?

లేదు.

ఇదంతా నాటకం సోదరులారా!

ఆ రాంబాబు బామ్మర్ది పెద్ద కంటరాకటరు.

ఆడికి ఈ మద్దెన కంటారాకటులు లేవు.

అందుకని, ఆడికి డబ్బు యిప్పించాలని పేటల్నీ, మీ బతుకుల్నీ, మీ నోటికాడ కూడుని పడగొట్టించేస్తున్నాడు అన్నాడండి.

ఆ మర్నాడు రాంబాబు మీటింగెట్టాడు.

ఈయనా సోదర సోదరీ మన్లారా అన్నారు.

"ఎంకటేసులు మాటలు నమ్మకండి.
ఇదంతా ఎన్నికల సంటు.
ఆయన కూడా మీకు అప్పుడేం సెప్పాడు!
మీ గుడిసెల్ని తీసేసి మేడలు కట్టిస్తానన్నాడుగా!
ఆయన మేడలు కట్టిస్తే మీ గెడిసెల్ని పడగొట్టడా!
అప్పుడు మీ బతుకులు ఏమైపోయి వుండేవి!
మీరు అతని మాటలు నమ్మకండి.

నేను మీ అందరికీ మంచి యిళ్ళు కట్టిస్తానని నా భార్యా బిడ్డల మీదా, దేశం మీదా, దేవుడి మీదా-చెప్తున్నాను.

మీ పేటను రెండేళ్ళలో సొరగంలా చేసేస్తాను అని-చేస్తున్నాను.

మీ అందరికీ మంచి మంచి పనులు-చెప్తున్నాను.

మీరంతా రామరాజ్యంలో వున్నట్టు వుంటారు.

ఎవరూ అలోలక్షణా అంటూ ఏడుస్తూ—సుకంగా వుంటారు."

"వుపన్నాసం బాగానే వుంది గాని మైకు ఏడిపించింది. మమ్మల్ని పెద్దోళ్ళే కాకుండా మైకులూ ఏడిపిస్తున్నాయి బాబు. మొన్న రేడియోలో వారతలు యింటుంటే రేడియో కూడా కుక్కరుపులే అరిచింది. అందులో వోర్తలు సెప్పే ఆయన "మొన్న చిలకల పూడిలో, మంతిరిగారు మాటాడుతూ బా, బా, బా, బా" మన్నారు, అన్నాడు.

మంతిరిగారే "బాబా" మన్నారో, రేడియోయే అందో మాకు తెలవకసచ్చాం."

నాకు నవ్వొచ్చింది. "తర్వాత?" అన్నాను.

"తరవాత మళ్ళీ ఎన్నికలొచ్చాయి"

"ఈసారి ఎవరు గెలిచారు?"

"రాంబాబుగారు వోడిపోయి ఎంకటేసులు గారు గెలిసారండి."

"ఆయనేవన్నా చేశారా?"

"ఆఁ! సగం సగం కొట్టేసిన గుడిశలున్నాయి కదా? రాంబాబుగారి పీడా పోయిందని, మళ్లీ అంతా ఎవురి తలాల్లో ఆళ్ళు గుడిసె లేసేసుకుని, ఎనకటి హోటేళ్ళూ, కొట్లూ' దుంపలూ పుణుకులూ, జంతికలూ అమ్ముకుంటున్నారండి. అలా ఏడాది గడిచింది. ఆ టాకటేర్లూ, మెసీన్లూ లారీలు తుప్పట్టి పోయాయని తీసుకు పోయారండి, శని యిరగడయిందను కున్నాం. కాని మళ్లి నెల తరవాత కొత్త టాకటేర్లు, లారీలూ, మెసీన్లూ వచ్చి మళ్లీ గుడిసెల్ని పడిగొట్టేయడం మొదలెట్టాయండి. ఈసారి అన్నిట్ని పడగొట్టేసారు" "మీరెళ్ళి వెంకటేశులుగార్తో చెప్పారా!"

"లేదండి మర్నాడు రాంబాబుగారు మీటింగెట్టి, మళ్లీ 'సోదర సోదరీ మన్లారా' అన్నారండి. 'చూసారా? నేను మీ పేటను బాగు చెయ్యాలని జాగత్తగా ప్లాను వేసి ఒక్కో-వీదీ కట్టి, తరవాత అందులో కొందరికి నివాసం ఏర పరిచి, తరవాత మరో ఈది బాగుసేసి, అప్పుడు మరో కొంద

రికి నివాసం యిచ్చి, తరవాత మరో ఊది యిల్లు కట్టించి మరి కొందరికియిచ్చి, తరవాత మరో ఊది కొట్టించి, యిల్లు కట్టించి, అప్పుడు మరో కొందరికి యిళ్ళిచ్చి, తరవాత మరో కొందరికి యిప్పించి, తరవాత మరో ఊది తీస్నేసీ ఇల్లు కట్టి, మరో కొందరికి కేటాయించి, తరవాత...అంటూ తరవాత, తరవాత, తరవాత, తరవాత, తరవాతంటూ.

రెండున్నర గంటలు తరవాత తరవాతలు సెప్పి, సెప్పి మొత్తం అప్పుడే అక్కడే రామరాజ్యాన్ని సూపించి 'ఆలో లచ్చనా' అని ఏడిపించేరు.

ఈసారి ఎందుకో మైకు కుయ్ కయ్ మన్లేదు.

మాకిక ఆయనగారి వుపన్యాసం యినాలనీ లేదు సప్పట్లు కొట్టాలనీ లేదు.

సివరికి 'బోలో సాతంత్ర భారత్‌కి జై' అన్నారు.

మేం ఎవరం ఆ మాట అన్లేదు.

'అనండి సోదర సోదరీ మన్లారా! బోలో సాతంత్ర భారత మాతకీ జై' అన్నారు.

ఈసారి మైకు గట్టిగా అరిచిందేమో నిద్దర పోతున్న సంటి పిల్లలు లేసిపోయి బేర్‌మంటూ ఏడుపులు మొదలెట్టారు.

ఆయనగారికి అరదంగాక 'సోదరులారా-ఎందుకు మీరు జై అంటంలేదూ?' అని మైకులో అడిగారు.

ముందొరసలో నేనే కూకున్నానండి.

నేను వెంటనే లేసి 'బాబయ్యా మా వందరం పిల్లలు

పుట్టకుండా నిన్ననే ఆపరేసన్లు సేయించుకున్నాం. గట్టిగా అరిస్తే కుట్లు తెగిపోతాయని బయంవోల్ల అరవటం లేదండి' అన్నా.

దాంతో రాంబాబుగారు బల్ల దిగి ఎల్లిపోయారు.

నాకు నవ్వాగింది కాదు.

"మరి మర్నాడు వెంకటేసులుగారు మీటింగెట్టారా?" అన్నాను.

"ఎట్టారండి."

"ఆయ నేమన్నారు?"

"సరిగ్గా ఈయన సెప్పిందానికి ఎతిరేకంగా ఆయన సెప్పారండి."

"మీలో ఎవరూ ఏం అనలేదా?"

"ఎందుకన్లేదండీ! పాపాల బైరవుణ్ణి నేనున్నానుగా! కూనీ సేసినోణ్ణి, లంజెరికం సేసినదాని అన్ననీ, రిచ్చావెదవనీ, రావఁరాజ్జంలో-అలో లచ్చనా అంటూ-రావుణ్ణొదిలి లచ్చనుణ్ణి తెలుసుకునే వాణ్ణి లచ్చనుడు-అన్నగారు సిన్నబుచ్చుకుంటారంటే 'అయ్యో రావాఁ రావాఁ' అనేవోణ్ణి, రావఁరాజ్జంలో, సాకలోడంత దైర్నంగా అనగలిగేవోణ్ణి— నేనున్నానుగా!"

"ఏమన్నా వేమిటి?"

"అయ్యా వెంకటేసులు గారూ! మీరు గుడిసెలు తీసేసి, మాకు బంగళాలూ, కాలనలూ, ఇసుకూళ్ళూ, ఎలట్రీడీపాలూ-ఇంకా ఏయేయో సేయిస్తావఁని అంటుంటారు.

ఆ రాంబాబుగారు "ఒరే ఎదవల్లారా! మీ గుడిసెలు పీకేస్తే మీరెలాగ బతుకుతా[రా? సర్కారోడి మాటంటే సవాలచ్చ సంవచ్చరాలకి నెరవేరుద్ది, అందుకా మీరు సత్తారా అని ఆయనా; మళ్ళీ ఆయన గెలిసి మేడలు కడతా వుంటే మీరొచ్చి 'ఒరే ఎదవల్లారా మీ గుడిసెలు పీకేస్తా మీరెలాగ బతుకుతారు? సర్కారోడి అడ్డరంటే సవాలచ్చ సంవచ్చరాలు పడద్ది అని మీరూ వుపదేసవిఁస్తే, మిమ్మల్ని గెలిపించాం. మీరు గెలిసి మా గుడిసెలు సగం పీకేస్తే, ఆ మారాజొచ్చి 'ఒరే ఎదవల్లారా-' అని ఆయనా; ఆయన గెలిసి మిగతాది పీకే స్తే మీరొచ్చి 'ఒరే ఎదవల్లారా' అని మీరూ-ఇలాగ ముప్పయి ఏళ్ళ నించీ యినీ, యినీ, యినీ, యినీ-మేం నిజంగానే ఎదవల వనుకుని, ఎందుకొచ్చిన బతుకు-ఎదవల్లాగే బతుకుదావని నిచ్చయించు కున్నావండి. ఎదవలం మేం. మాకు మల్లా ఎదవలని బిరుదా లెందుకండి? మా బాబుల తరం ఎదవల్లాగే గడిసిపోయింది. మా తరవూఁ ఎదవల్లాగే గడిసిపోతోంది. మా పిల్లలలతరవూఁ ఎదవల్లాగే గరుస్తుంది. మామనవళ్ళ తరవూఁ యెదవల్లాగే గడుసుద్ది. అందువల్ల మమ్మల్ని యిలా ఎదవల్లాగే బతకనియ్యండి బాబూ." అనేశాను. దాంతో ఆ బాబు, ఈ యెదవలకి యిక బుద్ధిరాదని యెల్లిపోయి, గ్యానవంతుల్ని సెయ్యాలని, ఏభై మంది యెదవల్ని మా కొంపలమీదికి పంపాడు. ఆ యెదవలు సాలా మంచెదవలుగాబట్టి మమ్మల్నీ, మా పెళ్ళాం బిడ్డల్నీ ఏం అనకుండా, మా గుడిసెలకి నిప్పటించారు. అంజ

సేయుడు మనోడు. అతగాడి బాబు వాయుదేవుడూ, అగ్గి దేవుడూ-రాంబాబూ, ఎంక టేసులల్లాంటి సేవితులు"

"అదేటి? విరోధులుకదూ! యెలక్షన్లలో ఒకరిమీద మరొకరు నిలబడి, ఒకరిమీద మరొకరు నేరాలు మోపు కుంటారు కదయ్యా?"

"తనరికి ఈ మోసాలు తెలవ్వేటి బాబయ్యా? రైతులుకదా సరిగ్గా తెలిసివుండదు. పైకి యెంత యిరోదుల్లా గున్నా లోపల సేవితులే, బాగా పెద్ద గాలేస్తుంటే సిన్న నిప్పు రాజుతుందా? తుప్పున ఆరిపోద్ది. అలాగే పెద్ద అగ్గి లేసినప్పుడు గాల్లేకపోతే ఆ అగ్గి కొంతసేపయ్యాక సల్లారి పూరుకుంటుంది. ఈళ్ళిద్దరికీ అలాంటి సేవితవే! రోజూ ఈళ్ళిద్దరూ, సినిమాఆలు యెనక గదిలో కూకుని, యిదేసీ సారాలు తాగుతూ, పెద్దింటి పిల్లల్తో సరసాలాడ్తుంటారు, ఈళ్ళతో బాటు సేర్మేన్లూ, సూడండి పన్నులేస్తారు ఆ అధి కార్లూ, పోలీసుల్లో పెద్ద దొర్లూ, కోరుటు లాయర్లూ, డాక టేర్లూ-ఒకరేంటి అంతా అక్కడే వుంటారు."

"నువ్వెలా చూశావ్?" అనడిగాను.

"సూసావ్ అనకండి. యెలా తేలిసింది అనండి."

"సరే! యెలా తెలిసింది?"

"అందరికీ తెలిసిన బాగోతం నాకు తెలవదు బాబూ?"

"అంటే విన్నావా?"

కాదు. ఒకసారి మొదటాట యిడిసి పెట్టినాక, ఏం బేరాలు దొరక్క, సినిమా యెనక సందునించి టేసన్‌కి పోతున్న. అక్కడ ఓకారు ఆగిపోయుంది. అందులో సాలా

నుంది ఆడా మగా వున్నారు. నా రిచ్చాని చూడగానే ఆళ్ళాపారు. ఆపిన ఆయన్ని సూడగానే నా పై పేణాలు పైనే యెగిరిపోయాయి బాబూ.

"ఏం!"

"ఆయన...ఆయన పోలీసోళ్ళందరికీ పెద్ద."

"ఏవన్నాడు!"

ఈ ఆడవాళ్ళని సినిమా దగ్గర దింపి రమ్మన్నారు. ముందు ఆడాళ్ళు రిచ్చా యెక్కడానికి ఒప్పుకోలేదు. తరువాత యెక్కారు. ఆళ్ళని సినిమాకాడ డింపి, మళ్ళీ రమ్మన్నారు. అలాగే సేసాను. తరువాత ఈ రాంబాబుగోరు యెక్కారు. సీసాలు పెట్టిలో పెట్టి యెక్కించారు. అయ్యాల దించి వచ్చాను, తరువాత పోలీసుబాబుని తీసికెళ్ళాను. లోపల దించి డబ్బులకోసం నిలబడివున్నాను. కిటికీలోంచి నాకు అంతా కనిపిస్తోంది. ఆ ఆడోళ్ళలో ఒకమ్మని ఎక్కడో సూసినట్టు గుర్తు. తల బద్దలు కొట్టుకున్నా గుర్తుకు రాటం లేదు. సివరికి గుర్తొచ్చింది. ఆ అమ్మగారు సినిమాల్లో ఏస్తా వుంటారు. నాకు బాగా తెలుసు.

ఏం పేరు!

పేరునాకు గుర్తులేదుగానీ, సాలా సినిమాల్లో ఏసింది. ఆమెకి, రాంబాబుగారు ఒక పక్క కూకుని, గ్లాసులో ఋదేసీ సారా ఏసి యిచ్చారు. అంతా గ్లాసులు తాకించి తాగుతున్నారు.

మరి నీకు డబ్బులు

ఎవరిస్తారు బాబయ్యా; లోపలకెళ్ళి అడగలేను గదా! ఒకరు పోలీసు బాబు, మరొకరు మా ఓటుల్తో నెగ్గిన మారాజు మరొకరు మా వోట్లు పడక, పోయిన మారాజు ఇక ఆడోళ్ళుంటారా! సినేమా వాళ్ళు. అలాగ కాసేపు నిలబడి, రామరాజ్జంకదా—అలో లచ్చనా అంటూ పోయాను.

నీకెందరు పిల్లలు గురువుగా!

సిన్నా సితకా అంతా కలిసి మొత్తం పది మందండి. సివర పిల్ల వొయసు పదారు.

మరిక పిల్లలు పుట్టలేదా?

ఇంకెలాగ పుడతారు బాబయ్యా! నాకూ నా భార్యకీ సంసార సంబంధంపోయి పది హేనేళ్ళయింది.

అదేం?

అతను చిరునవ్వు నవ్వాడు.

నా వొయసిప్పుడు ఏభై అయిదేళ్ళు. ఇంకా 'సంసారం' సెయ్యమంటారా ఆడదాంతో

మరి కోరిక లుండవ్?

మనసులో వుంటాదిగాని, సరీరం సడలిపోయింది. అయినా ముని మనవల్లు పుట్టేసినాక కూడా నేనింకా పిల్లల కోసం తాపత్త్రియం పట్టం-ఆళ్ళకెలాగుంటాది? అని సన్నగా నవ్వుకున్నట్టున్నాడు.

అని కోరికల్ని చంపేసుకుంటున్నావా?

అసలు పుట్టంది, కోరికే సంపుకోడ మెక్కడుంటాది? పందుల్లాటోళ్ళం. మాకు కోరికలేం వుంటాయ్ బాబయ్యా!

పదిమంది పిల్లల్ని కన్నానన్నావ్ కదా-వాళ్ళనందర్నీ ఎలాగ పోషిద్దామని!"

"అందర్నీ ఎల్లకాలం మనమే పోసించాలా బాబూ! ఒకో్కళ్ళకీ రెక్కలు రాగానే, ఏ అయ్యకో, అమ్మకో యిచ్చి కట్టబెట్టెయ్యవా!"

"అందరికీ పెళ్ళిళ్ళు చేసేశావా!"

"ఆఁ"

"అంటే ఇప్పుడు నువ్వూ, ముసలమ్మా మాత్రమే యింట్లో వున్నారన్న మాట."

"కాదు బాబు, పెద్దదియిదనై నాయింట్లోనే వుంటోంది నాలుగోదాన్ని మొగుడొదిలేసాడు. అడు దేన్నో మరిగి దీన్ని నానా బాదలూ పెడ్తుంటే, సూళ్ళైక నేనే తెచ్చేసుకున్నాను. ఆళ్ళిద్దరికీ కలిపి ఎనమండుగురు పిల్లలు."

"వాళ్ళ నందర్నీ నువ్వే పోషించాలా!"

"కనుకున్న తరవాత తప్పుతుందా బాబూ! అయితే పెద్దకూతురు కొడుకు కూడా రిచ్చాయే తొక్కతాడు. ఇంట్లో రోజుకి రూపాయిస్తాడు. మిగతా ఎంతొచ్చినా సినీమాలకీ, బట్టలకీ తగలేస్తాడు."

"నువ్వు వారించవా!"

"బాబూ! వారిస్తే నా మాట యింటాడా! తరం మారింది. ఆడికీ మంచి గుడ్డలేసుకు తిరగాలనీ, సేవితుల్తో షికార్లు కొట్టాలనీ వుంటాదిగదా! నా తరంలో నే నెలాగూ గుడ్డలకి నోసుకోలేదు. పోనీ ఆడన్నా తిరుగుతున్నాడు. అదే నా ఆనందం."

"తాగుతాడా?"

"రావఁరావఁ. ఆ బుద్ధుల్లేవు. ఆడు మాపేట్లో కమ్యూనిస్టు పార్టీతో వుండేవాడు. పది మఁదినీ సేర్చి, మంచిమాట్లు సెప్పేవాడు. తరవాత పారిటీలో ఏవో సీలిక లొచ్చాయట. ఈ దేసంలో కాదు మరేవో దేసాల్లోనట. అందుకని ఆ దేసాన్ని ఇష్టపడేవోరు—ఒక కమ్యూనిస్టులయారట, మరో దేసాన్ని సవఁర్ధించేవోళ్ళు, మరో పారిటీ కమ్యూనిస్టులయారట. మళ్లీ తరవాత మళ్లీ సీలిపోయారట. ఇక ఈడు, వాదించి వాదించి, మన్దేసంలో సొదేసీ కమ్యూనిస్టు పారిటీ మనవే ఏరపాటు సేసుకుందాఁ వన్నాడట. దానికెవ్వరూ వొప్పుకోలేదు. దాంతో పారిటీలూ గీరిటీలూ మానేసి, ఇప్పుడాడు ఏవో కదలు రాసుకుంటా వుంటాడండి. అయ్యి పేపర్లలో పడతా వుంటాయి. అక్కణ్నుంచి ఆడికి పదీ పరకా వస్తావుంటాయి."

"అలాగా? ఎంతవరకూ చదువుకున్నాడేవిటి?"

"ఎంతవరకూ సదివించగలం బాబూ? అయోకలాసు సదివి మానేసాడు. మొన్నలాగుంది ఆడు మెట్రిక్కట. అది సదివి పాసయ్యాడు."

"ఇంకా రిక్షా తొక్కుతూనే వున్నాడా?"

"మరేం చేత్తాడు!"

"ఏ గుమస్తా పన్లోనైనా చేరకూడదూ?"

"బాబూ! ఎమ్మేలూ, బియ్యేలూ సదివోనోళ్ళకేవుద్దోగాలు దొరకటం లేదిప్పుడు. కేవలం రిచ్చావోడి మనవడికి దొరుకుతాదా ఉద్దోగం? ఆడి పనేదో ఆడు సేసుకుని సెల్లెలినీ తమ్ముళ్ళనీ సూసుకుంటున్నాడు."

"అవునూ! నువ్వు ఈమధ్య సంతాన నిరోధం ఆపరేషన్ చేయించుకున్నావా?"

"అవునండి."

"ఎప్పుడు?"

"రెండేళ్ళ కిందటనుకుంటాను."

"మరి మీ భార్యాభర్తలకి సంసార సంబంధం లేదన్నావ్ కదా, ఈ ఆపరేషన్ దేనికి?"

"అది చేయించుకుంటే ఎనభై రూపాయలిస్తారట-దాని కాసపడి చేసుకున్నాను. కాని తీరా ఆపరేషనయాక నాకు ముట్టింది ఇరవయ్యే."

"అదేం?"

"నన్ను ఆసపటాలికి తీసికెళ్ళినాడు ఇరవైతీసుకున్నాడు ఆపరేసను చేసిన డాక్టేరు నలబై లాక్కున్నాడు. ఇక మిగిలింది ఇరవై. కానీ అక్కడున్న నరసమ్మ రెండ్రూపాయలడిగింది. మరో పాకీవోడు రూపాయడిగాడు. మరో డెవడో మరో రూపాయడిగాడు. కానీ నేను ఎవరికీ యివ్వలేదిక. ఆ ఇరవైయ్యీ పట్టుకుని యింటికొచ్చాను. కానీ రెణ్ణెల్లు రిచ్చా తొక్కకూడదని తర్వాత తెలిసింది. ఆ రెణ్ణెల్లూ ఎలాగ బతికానో ఆ బగమంతుడికి తెలియాలి...ఆఁ బాబూ! ఒక్క సిట వీకక్కుంటారూ? ఇప్పుడే వొస్తాను."

గురువులు రిక్షాదిగి, కొంత దూరంలో పాకలావున్న పెంకుటింట్లోకి వెళ్ళి, మూడు నిమిషాల్లో వచ్చేశాడు.

వాడు రాగానే గుప్పుమంది వాసన.

"సారా తాగవా?"

"అవును బాబూ!"

"రోజూ తాగుతావా?"

"లేదు. పొద్దుట్నుంచీ రిక్షా తొక్కుతున్నాను. వొళ్ళంతా పూనవైపోయింది. ఇదేసుకుంటే కూస్తంత నొప్పులు తగ్గుతాయి. సరే యిక ఎల్దావా?"

"నడు."

"నిజంగా ఎల్లాలనే వుందా బాబూ?"

"నువ్విన్ని నిజాలు చెప్పాక, తప్పకుండా వెళ్ళాలని వుంది."

"ఆళ్ళ దగ్గర జబ్బులుంటాయి బాబూ

"ఫర్వాలేదు."

"సరే మీయిష్టవైతే!"

రిక్షా ఎక్కి తొక్కాడు.

"వాళ్ళెంత తీసుకుంటారేవిటి గురువులూ?"

"అర్ధరూపాయినించి ఏబై రూపాయల వరకూ తీసుకుంటారు."

"ఎందుకా తేడా?"

"తేడా ఏంటి? ఆళ్ళ రేట్లంతే! తమరు సిన్న ఓటేల్ కెల్లారనుకోండి పదిహేను పైసలే టీ. అదే పెద్దోటేల్ కెల్లండి? రూపాయి!"

"దానికీ దీనికీ పోలికేంటయ్యా?"

"యాపారం బాబూ! పోలికలు కావు! టీలో ఇషవుం దంటారు. అది బడ్డీకొట్టులో తాగినా యిషవే. పెద్దోటేల్లో తాగినా యిషవే!"